ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 25.0

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి.. వివాహిత మృతి

- కుటుంబ సభ్యుల ఆందోళన
- ప్రభుత్వాసుపత్రికి మృతదేహం తరలింపు



ఏలూరు క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):ఆర్‌ఎంపీ వైద్యం వికటించి జ్వరంతో బాధపడుతున్న ఓ వివాహిత మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో ఆర్‌ఎంపీ క్లినిక్ వద్ద ఆందోళనకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏలూరు తూర్పు వీధి మేకల కబేళా ప్రాంతానికి చెందిన కటారి భారతి లక్ష్మి(25)కు భర్త వెంకటేశ్వరరావు, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వరరావు ఒక ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. లక్ష్మి మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతోంది. నాని క్లినిక్ నిర్వహిస్తున్న వంగాయగూడేనికి చెందిన ఆర్‌ఎంపీ గంచరి సురేశ్ బాబు(నాని) వద్దకు ఆమెను మంగళవారం ఉదయం తీసుకు వెళ్లగా రెండు ఇంజక్షన్లు చేశాడు. ఇంజక్షన్లు చేసిన కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వైద్యుడిని ప్రశ్నించగా ఏం కాదని కొంత సేపు విశ్రాంతి తీసుకోవాలని సూచించాడు. ఆమె ఎంతకీ మేల్కొనకపోవడంతో ఏలూరు టూ టౌన్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. బంధువులు మృతదేహాన్ని నాని క్లినిక్ వద్దకు తీసుకువచ్చి ఆందోళన చేపట్టారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ సిబ్బంది వచ్చి పరిస్థితిని పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలి

నూజివీడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని నూజివీడు సాధన సమితి డిమాండ్ చేసింది. నూజివీడు అమర్ భవన్‌లో మంగళవారం జేఏసీ సమావేశాలు నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర నాయకులు, జేఏసీ గౌరవ సలహాదారు చలసాని వెంకటరామారావు, జేఏసీ అధ్యక్షులు మరీదు శివరామకృష్ణ మాట్లాడుతూ మంత్రివర్గ ఉప సంఘానికి నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని కమిటీ త్వరలో వినతిపత్రం అందిస్తోందన్నారు. గతంలో ఏడాదిపాటు అనేక పోరాటాలు, ఉద్యమాలు, నిరసనలు చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో నూజివీడు సాధన సమితి జేఏసీ ముఖ్యులు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటుచేసి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు. జేఏసీ ట్రెజరర్ చాట్ల పుల్లారావు, సాధనసమితి నాయకులు బండారు రాజు, సునీల్‌కుమార్, యర్రంశెట్టి రాము పాల్గొన్నారు.



బ్యానర్ల తొలగింపుపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఎంగా 30 ఏళ్ల పూర్తి చేసుకున్న చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతూ నూజివీడు చిన గాంధీ బొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీని వైసీపీ శ్రేణులు తొలగించడంపై టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతికి నివాళుల ర్సిస్టూ ఫ్లెక్సీని ఏర్పాటు చేసేందుకు సీఎం ఫ్లెక్సీని తొలగించడంపై టీడీపీ నాయకులు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, కౌన్సిలర్లు తిరుమలశెట్టి సాధనా శ్రవంతి, కొమ్మన విజయ, మాజీ కౌన్సిలర్ నాగమణి, పాదం సత్యనారాయణ తదితరులు మండిపడ్డారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి సంస్కృతి లేదన్నారు. మంత్రి పార్థసారథి వచ్చిన తర్వాతే ఈ ప్రాంతం అభివృద్ధి సాధ్యపడిందన్నారు. నాయకులు ఇళయరాజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పండుగలకు ప్రత్యేక రైళ్లు



7లో..



తమ్మిలేరు ఉధృతి

శనివారపుపేట కాజ్‌ వేపై తమ్మిలేరులో చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్, పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివకిశోర్(కింద)

- ఏలూరు శనివారపుపేట కాజ్‌వేపై నుంచి నీటి ప్రవాహం
- రాకపోకలు నిలిపివేత.. కలెక్టర్, ఎస్పీ పరిశీలన
- జిల్లాలో భారీ వర్షాలు.. నిడమర్రులో అత్యధికం



ఏలూరు సిటీ/క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా మంగళవారం ఉదయం నుంచి ఏలూరు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా తమ్మిలేరు, ఎర్ర కాలువకు వరద ప్రవాహం పెరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు వద్ద తమ్మిలేరు నీటిమట్టం 347.9 అడుగులు ఉంది. వరద కారణంగా ఏలూరు శనివారపుపేట కాజ్‌వేపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రాజెక్టులోకి 4,719 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 2,710 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టు వద్ద నీటిమట్టం 82.30 మీటర్లకు చేరడంతో వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేస్తున్నారు. వరద ప్రమాదం పొంచి ఉండటంతో అధికారులను అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. తమ్మిలేరు వరద దృష్ట్యా ఏలూరు రూరల్, అర్బన్‌లోని శనివారపుపేట కాజ్‌వే, బాలయోగి వంతెన, తంగెళ్ళమూడి వంతెన ప్రాంతాలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్, మంగళవారం పరిశీలించారు. తమ్మిలేరు పరివాహక ప్రాంతాలకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, గట్ల పటిష్ఠతపై అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ 'జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తమ్మిలేరు, ఎర్రకాలువ, గోదావరి తీర ప్రాంతాలకు, కొల్లేరు వరద ప్రభావానికి గురయ్యాయి. నాగిరెడ్డి గూడెం వద్ద నీటిని విడుదల చేయటంతో తమ్మిలేరు పొంగి ప్రవహిస్తోంది. ఈ కారణంగా చింతలపూడి, లింగపాలెం, పెదవేగి, చాట్రాయి, ముసునూరు మండలాల్లోని గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఎర్రకాలువ కారణంగా జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో వరద పరిస్థితులు ఉంటాయి. అన్ని డివిజన్ కేంద్రాల్లో లైఫ్ జాకెట్లు, రోప్‌లు సిద్ధం చేశాం. కొల్లేరు లంక గ్రామాల్లో బోట్లలో ప్రయాణించవద్దు. దీనిపై ప్రజలకు టాంటాం ద్వారా తెలియజేయాలని అధికారులను ఆదేశించాం. జిల్లాలో వరద పరిస్థితులు తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు, అధికారులు అప్రమత్తంతో ఉండాలి' అని ఆదేశించారు. ఎస్పీ కె.ప్రతాప్‌శివకిషోర్ మాట్లాడుతూ తమ్మిలేరు వరద హెచ్చరిక నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, వరద ప్రవాహం ప్రవహిస్తున్న కాజ్‌వేల మీద ప్రయాణించవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని కోరారు. ఏలూరులోని శనివారపుపేట కాజ్‌వే, సీఆర్ఆర్ కాలేజీ సమీపంలోని బ్రిడ్జి, తూర్పులాకులు, పడమర లాకులు, తంగెళ్లమూడి ప్రాంతాలను పరిశీలించారు. ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, డీఎస్పీ శ్రావణ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ సీహెచ్ దేవప్రకాష్, నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



వరదలకు సిద్ధం

నిడమర్రులో అత్యధిక వర్షపాతం

గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా నిడమర్రు మండలంలో 29.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కామవరపుకోటలో 17.4, ఏలూరు అర్బన్ 8.2, టి.నరసాపురంలో 7.2, చింతలపూడి 6, ద్వారకా తిరుమల 4.2, లింగపాలెం 3.4, ఉంగుటూరు 3.4, ఏలూరు రూరల్ 2.8, భీమడోలు 2.6, వేలేరుపాడు 1.6, జీలుగుమిల్లి 1.2, కుక్కునూరు 1.4, పెదవేగి 0.6, దెందులూరు 0.6, జంగారెడ్డిగూడెం, పెదపాడు 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఎర్రకాలువ జలాశయంలోకి వరద నీరు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం ఎర్రకాలువ జలాశయంలో మంగళవారం వరద నీరు భారీగా చేరుకుంది. జలాశయం నీటిమట్టం 83.50 మీటర్లు కాగా మంగళవారం 83.35 మీటర్లకు చేరింది. ఉదయం 3200 క్యూసెక్కుల వరద నీరు జలాశయంలోకి చేరుతుండగా జలాశయం మూడు గేట్ల ద్వారా 2200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎర్రకాలువ జలాశయాన్ని ఆర్డీవో ఎంవి.రమణ, డీఎస్పీ యు.రవిచంద్ర పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ వరద ఉధృతి పెరిగితే దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంగిడిగూడెం-రాజవరం సరిహద్దుల్లో ఉన్న ఎర్రకాలువ కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహించడంతో ప్రజలు ఎటువంటి ప్రమాదాల బారిన పడకుండా కాజ్‌వే వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఉంచామని తెలిపారు.

గోదావరి దోబూచులాట



కుక్కునూరు తీరంలో గోదావరి వరద

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):గోదావరి వరద దోబూచులాడుతోంది. అల్పపీడన ప్రభావంతో ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు నాలుగు రోజులుగా పెరిగిన గోదావరి నీటిమట్టం మంగళవారం నాటికి నిలకడగా మారింది. ఉదయం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులు ఉండగా, సాయంత్రానికి నెమ్మదిగా పెరుగుతూ 41.50 అడుగులకు చేరింది. నాలుగు రోజులుగా గోదావరి నీటిమట్టం పెరుగుతూ, తగ్గుతూ, మరలా స్వల్పంగా పెరుగుతోంది. తెలంగాణలో భారీవర్షాల కారణంగా గోదావరికి వరద ప్రవహి స్తోంది. వేలేరుపాడు- కొయిదా, రుద్రమ్మకోట-రేపాక గొమ్ము మధ్య రహదారులు ముంపులో ఉండడంతో 23 గ్రామాలు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య వున్న కొండేటి వాగులో లెవిల్ కాజ్‌వే ఇంకా నీట మునిగే ఉంది. దీంతో ప్రజలు నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి తీర ప్రాంతంలో వేసిన వందలాది జామాయిల్ పంట నీట మునిగిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 93,1,017 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43.30 మీటర్లకు తగ్గింది. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.350 మీటర్లు, స్పిల్ వే దిగువన 24.000 మీటర్లు నమోదైంది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి. కడమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలు పెరిగాయి. ఏటిగట్టు కుడి వైపున వున్న కొండవాగుల జలాల నీటిమట్టం పెరిగి పంట పొలాలు నీట మునిగాయి.



ఆలయాలకు మహర్దశ

- లక్కవరం రామలింగేశ్వరస్వామి, చింతలపూడి విశ్వనాథ మఠానికి కోటి చొప్పున సీజీఎఫ్ మంజూరు

ఏలూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):అవసాన దశలోవున్న దేవాలయాల పునర్నిర్మాణంతో మహర్దశ పట్టనుంది. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని వాటికి దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆలయాలకు రాష్ట్ర ప్రభుత్వం జీర్ణోద్ధరణ పథకం కింద కార్పస్ గుడ్ ఫండ్(సీజీఎఫ్) కింద నిర్మాణాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో మంజూరై నిలిచిన వాటికి ఈ ఏడాదిలో గడిచిన ఐదు నెలలు కాలంలో పదుల సంఖ్యలో నిధుల మంజూరుకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రైవేట్ వ్యక్తులు, దాతలు ఆసక్తి వున్న దేవాలయాల అభివృద్ధికి 33 శాతం మ్యాచింగ్ గ్రాంట్ డిపాజిట్ చేస్తే ప్రభుత్వం 67 శాతం నిధులను మంజూరుచేస్తోంది. దీనికి దేవదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం అంచనాలు తయారు చేయాలి. గతంలో మంజూరైన ఆలయాలు 30 నుంచి 40 వరకు అభివృద్ధి దశలో ఉన్నాయి. తాజాగా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం రామలింగేశ్వరస్వామి ఆలయానికి కోటి రూపాయలు, చింతలపూడి విశ్వనాథమఠానికి కోటి, ఉంగుటూరు మండలం కంసాలిగుంట విశ్వేశ్వరస్వామి గుడికి రూ.10 లక్షలు, కామవరపుకోట పోలసానిపల్లి సీతారామస్వామి ఆలయానికి 43 లక్షలు 33 వేలు మంజూరుచేశారు. ఏలూరు కొత్తపేట ఆదర్శ ఆంజనేయస్వామి గుడి, బలివే రామలింగేశ్వరస్వామి, టి.నర్సాపురం తిరుమలదేవిపేట గుడులకు సంబంధిత దాతలు, నిర్వాహకులు మ్యాచింగ్ గ్రాంట్ జమ చేశారు. వీటికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

కోడి గుడ్ల నాణ్యత తగ్గకూడదు



సూరప్పగూడెంలో కోడి గుడ్ల స్టాక్‌ను పరిశీలిస్తున్న జేసీ ధాత్రి రెడ్డి

భీమడోలు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కోడి గుడ్లు నిర్దేశించిన పరిమాణంలోనే ఉండాలని జేసీ పి.ధాత్రిరెడ్డి ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కోడి గుడ్ల సరఫరా చేసే కోడి గుడ్ల స్టాక్ పాయింట్‌ను మంగళవారం జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుడ్లు ఎక్కువ రోజులు గోడైన్‌లో నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలన్నారు. లబ్ధిదారులకు అందించే పోషకాహారం నాణ్యత తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ప్రాజెక్టులోను సీడీపీవోలు క్రమం తప్పక ప్రతి నెలా స్టాక్ పాయింట్‌లు తనిఖీ చేసి, ప్రభుత్వం ఉద్దేశించిన పరిమాణంలోనే కోడి గుడ్లు ఉండేలాగా చూడాలన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ పి.శారద, భీమడోలు ప్రాజెక్టు సీడీపీవో ఎంఎస్ రాజశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు



ఏలూరు సిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్‌లో ఎరువులకు ఎటువంటి కొరత లేదని వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా తెలిపారు. ముందుగానే ఆరు వేల టన్నుల యూరియాను నిల్వ చేయడం ద్వారా రైతులందరికీ పూర్తి స్థాయిలో అందిస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు. 'ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 1,18,402 మెట్రిక్ టన్నుల ఎరువులు, 33,776 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ప్రస్తుతం 1298 టన్నుల యూరియా నిల్వ ఉంది. సెప్టెంబరు నెలకు 7,500 మెట్రిక్ టన్నుల యూరియా అంచనాకు గాను వెయ్యి టన్నులు జిల్లాకు వచ్చింది. జిల్లాకు చేరిన ఎరువుల్లో 70 శాతం 96 సొసైటీలు, 11 డీసీఎంఎస్ కౌంటర్ల ద్వారా, మిగిలిన 30 శాతం ప్రైవేటు డీలర్ల ద్వారా పంపిణీ చేస్తున్నాం. జిల్లాలోని డీలర్లు ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేసినా, అధిక ధరలకు విక్రయించినా వారి లైసెన్సులను రద్దు చేసి వారిపై ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం కఠినచర్యలు తీసుకుంటాం' అని హెచ్చరించారు.

రోడ్లు వర్షార్పణం



ఏలూరు బీడీ కాలనీలో రోడ్డు దుస్థితి

- ముంపు మండలాలు సహా జిల్లా అంతటా దెబ్బతిన్న రహదారులు
- నిధుల లేమితో నష్టం అంచనాలు కంటితుడుపే

(ఏలూరు- ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు నామరూపాల్లేకుండా కొట్టుకుపోయాయి. ఆగస్టులో అల్పపీడన ప్రభావంతో మూడు దఫాలు కురిసిన భారీ వర్షాలకు జిల్లా అంతటా రోడ్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లను పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం కొలువు దీరాక ఈ ఏడాదిలో పూర్తిస్థాయిలో రోడ్లను సుందరంగా తీర్చిదిద్దారు. చాలాచోట్ల అత్యవసరంగా సంక్రాంతి నాటికి మరమ్మతులు చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో బీటీ రోడ్లుగా మార్చారు. ఇటీవల వర్షాలు విస్తారంగా కురవడంతో ప్రధాన రహదారులపై భారీగా గోతులు తేలుతున్నాయి. ఏలూరు నగరం, చింతలపూడి, కైకలూరు, జంగారెడ్డిగూడెంల్లో రోడ్లు దెబ్బ తిన్నాయి. పోలవరం ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరుల్లో రోడ్లు నీళ్లలో నాని పూర్తిగా పాడయ్యాయి. ఏలూరు నగరంలోని జంగారెడ్డిగూడెం రోడ్డు నుంచి బీడీ కాలనీ మీదుగా తంగెళ్ళమూడికి వచ్చే రహదారిలోని రోడ్లు గోతులమయమై అధ్వాన్నంగా ఉన్నాయి. వర్షాలకు రోడ్లన్నీ ఛిద్రమై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో నివాసాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని, గజానికో గొయ్యి అడుగుకో మడుగు ఉండడంతో రాకపోకలు ఎలా సాగించాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అంచనాల్లో నిర్లిప్తత ఎందుకో?

జిల్లావ్యాప్తంగా రోడ్లను బాగు చేయించడం యంత్రాంగానికి తలపోటుగా మారింది. కలెక్టర్ వెట్రిసెల్వి మా జిల్లాలో రోడ్లకు విరివిగా నిధులివ్వండి అంటూ సీఎం చంద్రబాబు ఎదుటే కలెక్టర్ల సమావేశంలో ప్రస్తావించారు. అయితే జిల్లాకు ఏ మాత్రం ప్రాధాన్యత పెరగకపోవడం విమర్శలకు తావి స్తోంది. 'నేను కూడా ఏమీ చేయలేకపోతున్నా.. నిధుల్లేవు' అని ఆమె ఇటీవల విలేకరుల సమావేశంలో ప్రస్తావించడం కొసమెరుపు. కాగా మండలాల్లో ఏఈల కొరత కారణంగా అంచనాలు పూర్తి కావడం లేదు. గోతులు ఏర్పడిన ప్రాంతాల వారీగా నిధులను ఆర్‌అండ్‌బీ ప్రభుత్వం మంజూరు చేస్తుండడంతో ప్రతిపాదనలు పంపినా నిర్వహణ గ్రాంట్ రాకపోవడం అధికారుల్లో నిర్లిప్తతకు కారణంగా తెలుస్తోంది. ఏటా రోడ్ల నిర్వహణకు గ్రాంట్లు విడుదల లేకపోవడం వలనే ఈ సమస్య తలెత్తుతోందని అధికారులు వెల్లడిస్తున్నారు. సెప్టెంబరులోను అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే తేల్చి చెప్పిన నేపథ్యంలో రోడ్లకు ఎప్పటికి మోక్షం కలుగుతుందో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రాథమిక అంచనాలపై నివేదిక

జిల్లాలో రోడ్లు మరమ్మతులు ఎంత మేర చేయాల్సి ఉంటుందనే (మిగతా 8వ పేజీలో..)

పురుషులకు పొదుపు సంఘాలు

- డ్వాక్రా తరహాలోనే పొదుపు.. ఆపై రుణాలు
- ఆరు రంగాల్లోని వారితో గ్రూపుల ఏర్పాటు
- ఏలూరు, మరో మూడు పట్టణాల్లో 70 సంఘాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

పురుషులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారితో స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఐదు నెలల క్రితం మెప్మా డైరెక్టర్ నంబూరి తేజ్ భరత్ ఉత్తర్వులు జారీచేశారు. ఏలూరు జిల్లాలోను డ్వాక్రా సంఘాల మాదిరిగా పొదుపును అలవాటు చేసి, ఆరు నెలలు తర్వాత వారికి రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం అవుతోంది. మిషన్ ఎలిమేషన్ ఆఫ్ పావర్టీ (మెప్మా) ఆధ్వర్యంలో ఏలూరు కార్పొరేషన్, నూజివీడు మున్సిపాల్టీ, జంగారెడ్డిగూడెం, చింతలపూడి నగర పంచాయతీల్లో ఈ సంఘాలను ఏర్పాటు చేయడానికి అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ప్రధానంగా భవన నిర్మాణ కార్మికులు, రవాణా రంగ కార్మికులు, గిగ్ వర్కర్లు, డొమెస్టిక్ వర్కర్లు(స్విగ్గీ, జమోటో), పారిశుధ్య కార్మికులు (కాంట్రాక్టు కార్మికులు) కేర్‌టేకర్స్ (వాచ్‌మెన్లు) తదితర ఆరు రకాల పనులు చేసుకునే పురుషులతో సంఘాలను రిజిస్టర్ చేయిస్తున్నారు. వారితో ఇప్పటికే ఐదు నెలలు పొదుపును చేయించడం అలవాటు చేశారు. రూ.వంద నుంచి రూ.500 వరకు పొదుపు చేసుకునేలా, వారికి తీర్మానాలు చేయించడం, ఆపై పుస్తకాలు (రిజిస్టర్)లు నిర్వహణ చేపట్టారు. ప్రధానంగా పురుష సంఘాలకు కనీసం ఐదుగురు సభ్యులుంటే చాలు. అంతకంటే పది మంది ఉండవచ్చు. ఐదుగురితో సంఘం ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో వివిధ వర్గాలను ఒకచోటికి చేర్చడం వారికి సులభతరం అవుతోంది. ఇప్పటికే ఐదు నెలలు పొదుపు పూర్తి కావడంతో, ఇంకో నెల వారితో పొదుపు చేయించి వారికి రుణ సౌకర్యం కల్పించి వారికి నచ్చిన వ్యాపారాలు చేసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టారు.

ప్రస్తుతానికి 70 సంఘాల స్థాపన

ఏలూరు 19, నూజివీడు 33, జంగారెడ్డిగూడెం 17, చింతలపూడిలో ఒక సంఘం కలిపి మొత్తం 70 సంఘాలను ఏర్పాటుచేశాం. ఈ సంఖ్య పెంచడానికి క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రధానంగా భవన నిర్మాణ, రవాణా రంగ కార్మికులు సభ్యులుగా చేరేందుకు బాగా ఆసక్తి చూపిస్తున్నారు. సాధ్యమైనంత మేర ఎక్కువ మందికి ఈ సంఘాల్లో సభ్యులుగా చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. సంఘాల ఏర్పాటు నిరంతరంగా జరుగుతుంది. ఆరు నెలలు పొదుపు పూర్తయ్యాక ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణాల సౌకర్యం కల్పించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. అన్నీ సక్రమంగా జరిగితే దసరా లేదా దీపావళి నాటి రుణాలు ఇస్తాం.

\- మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.మాధవి



स्वच्छ भारत
एक कदम स्वच्छता की ओर
Swachhata

గ్రామాల్లో శుభ్రత పెంపొందించడానికి

స్వచ్ఛత అవార్డులు

- పట్టణ, గ్రామ స్థాయిలో వివిధ విభాగాల్లో అవార్డులు
- గాంధీ జయంతి నాటికి అందించేందుకు చర్యలు
- అవార్డు ఎంపికకు ప్రత్యేక బృందాలు
- ప్రభుత్వ అధికారులు, ప్రైవేటు సంస్థలకు ప్రోత్సాహం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామ స్థాయిలో పారిశుధ్యం, పరిశుభ్రత, పచ్చదనం పెంపెందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రోత్సాహక అవార్డులు అందించనుంది. పట్టణాలు, గ్రామ స్థాయి నుంచి పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గాంధీ జయంతికి స్వచ్ఛత అవార్డులు అందించనుంది. స్వచ్ఛాంధ్ర 2025 పేరుతో ఈ అవార్డులు అందించనున్నారు. గతంలో ఉన్న ఈ ప్రోత్సాహక అవార్డులు కొన్ని సంవత్సరాలుగా కనుమరుగయ్యాయి. ముఖ్యంగా స్వచ్ఛత సాధనకు కృషిచేసేవారిని గుర్తించి గతంలో టీడీపీ పాలనలో జాతీయ స్థాయిలో అందించే అవార్డులకు ప్రాధాన్యం ఇచ్చేవారు. కానీ తరువాత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవార్డులు లేవు, స్వచ్ఛత మాటే వినపడలేదు. చివరికి పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు నిధులే లేకుండా పోయాయి. ప్రస్తుతం స్వచ్ఛతను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి అవార్డులు అందించనున్నారు. ప్రభుత్వ శాఖలతోపాటు, ఇతర సంస్థలు, ఎన్జీవోలతోపాటు అధికారులకు వ్యక్తిగతంగా అవార్డులు అందించనున్నారు. ఈ అవార్డుల ఎంపిక రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు అందించనున్నారు. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛాంధ్ర 2025 అవార్డులను గాంధీ జయంతి పురస్కరించుకుని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో, రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లా స్థాయిలో ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్ అవార్డులు ప్రధానం చేయనున్నారు.

జాతీయ స్థాయి అవార్డులు..

స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో జిల్లాలో రెండు నెలల నుంచి స్వచ్ఛతపై వివిధ అంశాల్లో ఒక కేంద్ర బృందం పర్యటిస్తూ గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు, ప్రజల అవగాహన, చెత్త నిర్వహణ, వేస్ట్ వాటర్ నిర్వహణ తదితర అంశాల్లో క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. ఈ పరిశీలనలో కేంద్ర బృందం అందించిన నివేదిక ఆధారంగా జాతీయ స్థాయిలో ఉత్తమ స్వచ్ఛత అవార్డులు కూడా అందుకోనున్నారు.

రాష్ట్రస్థాయి స్వచ్ఛతా అవార్డులు..

స్వచ్ఛాంధ్ర అవార్డులు మునిసిపల్ కేటగిరిలో స్వచ్ఛ మునిసిపాలిటీలు, స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ఎస్, స్వచ్ఛాంధ్ర వారియర్స్, పంచాయతిరాజ్ విభాగంలో స్వచ్ఛ గ్రామ పంచాయితీలు, గ్రామ కమిటీలు, స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్స్, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ అంగన్‌వాడీలు, స్వచ్ఛ హాస్పిటల్స్ స్వచ్ఛ బస్ స్టేషన్‌లు, స్వచ్ఛ రైతు బజార్‌లు, స్వచ్ఛ హాస్టల్స్ స్వచ్ఛ ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛ ఎన్జీవోలు, స్వచ్ఛ రెసిడెన్షియల్ స్కూల్స్ విభాగాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు అందించనున్నారు. ఈ అవార్డులు అందించేందుకు ఒక బృందం పర్యటించి స్వచ్ఛత అవార్డులకు గ్రామాలు, పట్టణాలతోపాటు వివిధ విభాగాల్లో అవార్డుల కోసం ఎంపిక చేయనున్నారు. పరిశుభ్రత, పచ్చదనం పెంపెందించడమే లక్ష్యంగా ప్రోత్సహించనున్నారు.

విభిన్న రూపాలలో విఘ్నాధిపతి


ద్వారకాతిరుమల కొప్పిశెట్టివారి వీధిలో దాదాపు 14 అడుగుల ఎత్తు, 9 అడుగుల వెడల్పున నేరేడు పండు రంగులో గణనాథుడు ప్రధాన ఆకర్షణగా ఉన్నాడు.


తణుకు పట్టణం సజ్జాపురంలో శ్రీలక్ష్మి గణపతి యూత్ ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో మంగళవారం రూ.16.50 లక్షల విలువైన వంద నోట్లతో అలంకరించారు.


ఏలూరు నగరం సత్రంపాడులో లక్ష్మీ గణపతిని ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి విగ్రహం చుట్టూ ప్రమిదలు ఏర్పాటు చేయడంతో వెలుగులు చిందించాడు.

ప్రకృతి పంట


సేంద్రియ జామ తోటలో బంగార్రాజు

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ.. ప్రకృతి వ్యవసాయం
- స్వగ్రామంలో వరితో పాటు జామ తోట.. తేనెటీగల పెంపకం
- తృణ ధాన్యాలు, ధాన్యం, ఇతర పదార్థాల స్టాల్ ఏర్పాటు

ఆయన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి.. ఆఫీసు, ఇల్లు ఉద్యోగ జీవితం సాఫీగా సాగుతోంది. కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ వద్ద అదనపు వ్యక్తిగత కార్యదర్శిగా విధులు నిర్వరిస్తున్న సమయంలో ఆ మంత్రి హాజరైన సమావేశాలు ఆయన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. వ్యవసాయంపై ఆయన దృష్టి మళ్లింది. తాడేపల్లిగూడెం మండంల దండగర్రలో ఐదు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. తర్వాత వెంకట్రామన్నగూడెంలో నాలుగెకరాల్లో జామ తోట వేశారు. ఆయన పేరు వుడుమూడి విరాట్ బంగార్రాజు. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన చెందిన బంగార్రాజు మహిళా శిశు సంక్షేమ శాఖలో డిప్యూటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. రెండేళ్లలో ఉద్యోగ విరమణ తర్వాత పూర్తిగా వ్యవసాయం చేస్తానని చెబుతున్నారు. రైతులు అంతా ప్రకృతి వ్యవసాయం చేయడానికి ప్రోత్సహిస్తానని ఆయన ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన వుడుమూడి బంగార్రాజు కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖలో డిప్యూటీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. వెంకట్రామన్నగూడెం, దండగర్రలో ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో వరి, జామ తోటలు సాగు చేస్తున్నారు. దండగర్రలో 5 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. తర్వాత వెంకట్రామన్న గూడెంలో మరో 4 ఎకరాలు కొనుగోలు చేసి సేంద్రియ పద్ధతిలో జామ తోట సాగుచేస్తూ మిగిలిన రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ తాతల సమయంలో వ్యవసాయం చేసేవారని, తాను కూడా వ్యవసాయం చేయాలనుకున్నట్లు చెబుతున్నారు. తన సర్వీసులో కొన్ని సమావేశాల ప్రభావం సమాజంలో ఆరోగ్యానికి ఉన్న ప్రాధాన్యత తనను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపించినట్లు వివరించారు. అనుకున్నదే తడవుగా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తీసుకుని సాగు ప్రారంభించారు. తన సోదరులతో కూడా ప్రకృతి సాగు చేయిస్తున్నారు. కుటుంబానికి సరిపడా వస్తువులతో పాటు స్టాల్ కూడా నిర్వహిస్తున్నారు.

తోటి వారికి అందించాలని..

ప్రకృతి వ్యవసాయ ఫలాలు కొంత ఖర్చు అని తెలిసినా రైతులకు ఆ ఫలాలు అందించాలని.. వారు కూడా ఆ దిశగా ముందుకు రావాలని తన ప్రయత్నం అన్నారు. రైతులు ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించే స్థాయికి చేరాలని బంగార్రాజు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువుల తయారీ..

సేంద్రియ ఎరువుల తయారీకి సొంతంగా పుల్లటి మజ్జిగ, జీవామృతం, పంచగవ్యం తయారు చేయడం ద్వారా సాగుచేస్తున్నారు. అవసరమైతే జీవ ఎరువుల తయారీకి తోటి రైతులకు సూచనలు సలహాలు అందిస్తానని బంగార్రాజు చెబుతున్నారు. ప్రకృతి వ్యవసాయంతో అందరికీ ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందంటున్నారు.



మరిన్ని పంటలు సాగు చేస్తా

ఉద్యోగ జీవితం మరో రెండేళ్ల ఉంది. తరువాత పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి మరిన్ని పంటలు సాగు చేస్తా. రైతులు వ్యవసాయం ప్రకృతి సేద్యం చేయకపోయినా వారి కుటుంబ అవసరాలకు సరిపడా పండిస్తే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది.

- వుడుమూడి విరాట్ బంగార్రాజు, రైతు



జామ.. తేనె.. పప్పుల స్టాల్

వరితోపాటు జామ, పుట్ట తేనె, ప్రకృతి వ్యవసాయంలో తనతో శిక్షణ పొందిన ఇతర రాష్ట్రాల రైతుల నుంచి కందిపప్పు, మినపప్పు, ఇతర ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు, గిరిజనుల సంప్రదాయ వ్యవసాయం ద్వార వచ్చిన ఉత్పత్తులను విక్రయించేందుకు ఓ మాదిరి స్టాల్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం.


నరసాపురంలో కార్లతో ర్యాలీగా వెళుతున్న జేఏసీ నాయకులు

నరసాపురం పట్టణాన్ని

జిల్లా కేంద్రం చేయండి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన జేఏసీ నాయకులు

భీమవరం టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పట్టణాన్ని పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ కోరింది. నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, అఖిలపక్ష జేఏసీ కన్వీనర్ నెక్కంటి సుబ్బారావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరు రామరాజు, తదితరులు మంగళవారం భారీ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్ నాగరాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల మనోభావాలు పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. జిల్లా నలుమూలల జిల్లా ప్రధాన కార్యాలయాలకు వచ్చే వచ్చే ప్రజలు, ఉద్యోగులకు నరసాపురం సౌకర్యంగా ఉంటుందన్నారు. నరసాపురం పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలకు అనుకూలమైన అనేక భవనాలు ఉన్నాయని, ఇంకా అవసరమైన భవనాలకు పట్టణంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వ్యతిరేకం కాదు : కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

నరసాపురం జిల్లా కేంద్రం కావడానికి తాను వ్యతిరేకం కాదని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. ఈ ప్రతిపాదన తన ముందుకు వచ్చినపుడు జిల్లాకు వచ్చే బృందానికి చెబుతానని ఆయన స్పష్టం చేశారు. అఖిల పక్ష నాయకులు వర్మను కలసి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు వర్మతో మాట్లాడారు. నరసాపురం పూర్వం నుంచి రెవెన్యూ డివిజన్‌గా ఉందన్నారు. జిల్లా విభజన సమయంలో చాలాచోట్ల రెవెన్యూ డివిజన్లను, పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాలను జిల్లా కేంద్రాలు చేశారన్నారు. వర్మ మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నందున జిల్లా ఏర్పాటుకు సంబంధించి కమిటీ వచ్చినపుడు చెబుతానని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళి, నెక్కంటి సుబ్బారావు, పొత్తూరి రామరాజు, కోటిపల్లి వెంకటేశ్వరారవు, వలవల నాని, పోలిశెట్టి నళిని, పోలిశెట్టి శ్రీనివాస్, జక్కం శ్రీమన్నారాయణ, నెక్కంటి క్రాంతి, వసంతరావు, అఖిలపక్ష నాయకులు ఉన్నారు.

నరసాపురం నుంచి జేఏసీ భారీ ర్యాలీ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం భారీ కార్ల ర్యాలీ నిర్వహించారు. జేఏసీ నాయకులు పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి భీమవరం ర్యాలీగా బయలుదేరారు. కార్లకు ఎమ్మెల్యే, విప్ నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, కన్వీనర్ నెక్కంటి సుబ్బారావు జెండా ఊపారు. పట్టణంలోని ప్రధాన వీధుల నుంచి ర్యాలీ భీమవరం వెళ్లింది.

కోడి లేకుండా.. కోడి పిల్ల..!


ఇంక్యుబేటర్ లోపల కోడి పిల్లలు


థర్మాకోల్ ఇంక్యుబేటర్లు

- ఆధునిక టెక్నాలజీతో థర్మాకోల్ ఇంక్యుబేటర్స్
- కోడి పిల్లలను పొదిగించడంలో మెరుగైన ఫలితాలు
- ఇంక్యుబేటర్ ఖర్చు రూ.4 వేలు
- బయట మార్కెట్‌లో రూ.25 వేల నుంచి రూ.లక్ష
- గురవాయిగూడెం రైతు సృష్టి

కోడి గుడ్లను కోడి పెట్ట పొదిగితే పిల్లలు వస్తాయి.. ఇక్కడ కోడి పెట్ట లేకుండానే కృత్రిమ పద్ధతిలో పిల్లలు వస్తున్నాయి. వాస్తవానికి కోడి పెట్టను డమ్మీ గుడ్లతో మాయ చేసి మరీ పిల్లలను చేస్తారు. ఇంక్యుబేటర్‌లో నాటు కోడి గుడ్లను ఉంచి సరిపడా టెంపరేచర్ అందేలా విద్యుత్ బల్బ్ ఏర్పాటు చేసి నిర్ణీత సమయంలో పిల్లలను చేస్తారు. పిల్లల సంరక్షణ చూసేలా కోడిపెట్టను డమ్మీ గుడ్లపై ఉంచుతారు. ఇంక్యుబేటర్ నుంచి వచ్చిన పిల్లలను తర్వాత కోడి పెట్ట వద్ద ఉంచుతారు. అది తానే పొదిగి పిల్లలను చేసినట్లు భావిస్తుంది. మార్కెట్‌లో ఇంక్యుబేటర్ దాదాపు రూ.25 వేల నుంచి రూ.లక్ష ధర ఉంటుంది. గురవాయిగూడెం గ్రామానికి చెందిన రైతు కేవలం రూ.4 వేలతో థర్మాకోల్ ఇంక్యుబేటర్లు తయారు చేశారు.

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి అతి తక్కువ ఖర్చుతో పందెం కోడి పిల్లలను పొదిగిస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు గ్రామీణ రైతు దల్లి చంద్రశేఖర రెడ్డి. జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామానికి చెందిన రైతు దల్లి చంద్రశేఖర రెడ్డికి పందెం కోళ్లను పెంచడం అంటే ఎంతో ఇష్టం. తన పొలంలో మంచి జాతి కోళ్లను పెంచుతున్నారు. అంతేకాదు వాటి గుడ్లను సేకరించి ఇంటివద్దనే థర్మాకోల్ బాక్స్‌లతో చేయించిన ఇంక్యుబేటర్ల (కోడిగుడ్లను పొదిగే యంత్రాలు)లో పిల్లలను పొదిగిస్తున్నారు. ఒక్కొక్క ఇంక్యుబేటర్ గుడ్ల సంఖ్యను బట్టి పలు కంపెనీలు రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు అమ్ముతున్నాయి. కంపెనీలు తయారు చేసిన ఇంక్యుబేటర్ కొంతకాలం వాడిన తరు వాత ఖర్చు బాగా పెరిగిపోతుంది. దీనితో రైతు చంద్రశేఖరరెడ్డి ప్రత్యామ్నాయం ఆలోచించారు. జంగారెడ్డిగూడెం మండలంలోని పేరంపేట గ్రామానికి చెందిన చదలవాడ కృష్ణ సహకారంతో మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో థర్మాకోల్ బాక్స్‌లు, ఇతర మెటీరియల్ తెప్పించి 3 ఇంక్యుబేటర్లను తయారు చేయించారు. వాటికి రూ.పది వేల లోపు ఖర్చు చేసినట్లు చంద్రశేఖర రెడ్డి తెలిపారు. నాలుగేళ్లుగా థర్మాకోల్ ఇంక్యుబేటర్లను ఉపయోగిస్తూ మెరుగైన ఫలితాలను పొందుతున్నారు. ఒక్కొక్క ఇంక్యుబేటర్‌లో 77 గుడ్లు ఉంచుతున్నారు. వాటిలో ఒక్కొక్క బాక్స్‌లో 40 నుంచి 50 పిల్లలు మాత్రమే వస్తాయని మిగతా గుడ్ల నుంచి పిల్లలు తయారు కావని ఆయన వివరించారు.


ఇంక్యుబేటర్‌లో ఉంచిన నాటు గుడ్లు

ఇంక్యుబేటర్ తయారీకి కావలసిన వస్తువులు

100 కోడిగుడ్లు పట్టే థర్మాకోల్ బాక్స్-1
అరవై వాట్స్ విద్యుత్ బల్బ్-1
టెంపరేచర్ మీటర్-1
కూలింగ్ ఫ్యాన్‌లు-2
రొటేషన్ మీటర్-1
ట్రేలు-2
విద్యుత్ సరఫరా

ఇంక్యుబేటర్ తయారీ విధానం

థర్మాకోల్ బాక్స్ లోపల కోడి గుడ్లకు వేడికోసం విద్యుత్ బల్బ్ ఏర్పాటు చేస్తారు. గుడ్లను ట్రేలలో ఉంచుతారు. తేమ కోసం బాక్స్ లోపల ప్రతీ రోజు పావు లీటరు నీటిని ఒక గిన్నెలో పెడతారు. బాక్స్ లోపల నిరంతరం వేడిని చెక్ చేయడానికి బయట టెంపరేచర్ మీటర్, బాక్స్ లోపల ట్రేలపై పెట్టిన గుడ్లను ఆటోమేటిక్‌గా రొటేట్ చేయడానికి రొటేషన్ మీటర్‌ను బిగిస్తారు. బాక్స్ లోపల గుడ్లకు 37.5 సెంటిగ్రేడ్ వేడి ఉండేలా మీటర్‌లో సెట్ చేస్తారు. టెంపరేచర్ ఎక్కువైతే ఆటోమేటిక్‌గా బల్బ్ ఆగిపోయి కూలింగ్ ఫ్యాన్‌లు తిరుగుతాయి. కాస్త టెంపరేచర్ తగ్గగానే బల్బ్ ఆటోమేటిక్‌గా వెలుగుతూ వేడినిస్తుంది. 21 రోజుల పాటు తల్లి కోడిపెట్ట పొదిగినట్లే ఇంక్యుబేటర్‌లో కూడా 21 రోజుల్లో గుడ్ల నుంచి కోడిపిల్లలు బయటకు వస్తాయి. కోడి గుడ్లను ఇంక్యుబేటర్‌లో పెట్టే ముందుగానే కొన్ని డమ్మీ గుడ్లను కోడిపెట్టను పొదిగిస్తారు. ఇంక్యూబేటర్ నుంచి వచ్చిన కోడిపిల్లలను 24 గంటల తర్వాత కోడిపెట్ట దగ్గర ఉంచుతారు. ఆ కోడిపెట్ట తాను పొదిగిన పిల్లలే అన్న భావనతో అవి పెద్దవి అయ్యే వరకు సంరక్షిస్తుంది. నాటు కోళ్లను కృత్రిమ పద్ధతిలో తక్కువ ఖర్చుతో పొందవచ్చని రైతు చంద్రశేఖర రెడ్డి చెబుతున్నారు.


ఇంక్యుబేటర్ నుంచి వచ్చిన కోడి పిల్లలతో రైతు చంద్రశేఖర రెడ్డి


మావుళ్లమ్మ సన్నిధిలో ద్వారకాతిరుమలరావు దంపతులు

మావుళ్లమ్మను దర్శించిన

ఆర్టీసీ ఎండీ

భీమవరం టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మను ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికివచ్చిన దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు కొడమంచిలి కొప్పేశ్వరరావు పూజలు నిర్వహించి ఆశీర్వచనాలను అందించారు. .ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ శేష వస్త్రం, ఫొటో, ప్రసాదాలు అందించారు. ఆయన వెంట ఏఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ జయసూర్య, తదితరులు ఉన్నారు.

మంచిలి ఉపాధ్యాయుడికి

జాతీయ అవార్డు



తణుకు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో చేసిన విశేష కృషికి మంచిలి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నేలపాటి వెంకటరమణకు జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయులు సంఘం జిల్లా అధ్యక్షుడు నేలపాటి వెంకట రమణ వివరాలు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అవార్డును ఈనెల 16న న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి సెమినార్‌లో ఎన్‌టీఈఈ అవార్డు అందజేయనున్నట్లు చెప్పారు. వెంకట రమణ 1983లో ఉపాధ్యాయుడిగా చేరినట్లు చెప్పారు. 13 ఏళ్ల నుంచి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ దాతల సహకారంతో విరాళాలు సేకరించి పాఠశాల అభివృద్ధి చేశారన్నారు. ఉపాధ్యాయ సంఘాల్లో పనిచేసి సమస్యలను పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించినట్లు తెలిపారు.



ఏలూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు స్వాగతం పలుకుతున్న తపనా చౌదరి, విక్రమ్ కిశోర్, అంబికా కృష్ణ, తదితరులు

ఏలూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

నేడు శోభాయాత్ర, కార్యకర్తల విస్తృత సమావేశం

ఏలూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం పర్యటించనున్నారు. మంగళవారం రాత్రి ఏలూరు చేరుకున్న ఆయనకు కొత్త బస్టాండ్ సమీపంలో తపన చౌదరి, విక్రమ్ కిశోర్, అంబికా కృష్ణ స్వాగతం పలికారు. ముందుగా ఏలూరులో మాధవ్ పర్యటనకు నాయకులు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 7.30 గంటల నుంచి రాత్రి 8 గంటలకు వరకు మాధవ్ పర్యటనలో లోటు పాట్లు లేకుండా జాగ్రత్తలు తీసు కున్నారు. శోభాయాత్ర, జిల్లా విస్తృత స్థాయి సమావేశాలు నిర్వ హించే ప్రాంతాల వద్ద ఏర్పాట్లను రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, జిల్లా కార్యదర్శులు గాది రాంబాబు, వీరవరపు దుర్గా నివాస్, కృష్ణ, బాడిత నారాయణ పర్యవేక్షించారు. కార్యకర్తలు, నాయకులతో కలిసి మాధవ్ జూట్‌మిల్లు వరకు శోభాయాత్రలో పాల్గొంటారని, అనంతరం పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొంటారు. సాయంత్ర 5 గంటలకు ప్రముఖులు, మేధావులతో సదస్సు నిర్వహిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్

పేదలకు అండగా జన సురక్ష పథకం

ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ బషీర్

పెదవేగి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జన సురక్ష పథకం పేద ప్రజలకు అండగా ఉంటుందని ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ ఏవో బషీర్ అన్నారు. జన సురక్ష పథకాల ద్వారా సామాన్య ప్రజలకు సామాజిక భద్రత లభిస్తుందన్నారు. ఏపీ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జన సురక్ష పథకాలపై అంకన్నగూడెం, కొప్పాక గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఆపద సమయంలో జన సురక్ష పథకాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగమని, ప్రతి ఒక్కరూ వాటిలో నమోదు కావాలన్నారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ మొత్తం బీమా వస్తుందని, బ్యాంకు ఖాతా ఉన్నవారు బ్యాంకు సిబ్బందికి ఆమోదం తెలిపితే జన సురక్ష పథకాలలో నమోదు చేస్తారని ఆయన తెలిపారు. బ్యాంకులు సక్రమంగా పనిచేయాలంటే ప్రతి ఒక్కరూ ఈకేవైసీ, సీ కేవైసీ చేయించు కోవాలని సూచించారు. ఆన్‌లైన్, సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పారు. అటల్ పెన్షన్ యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జనధన్ యోజన తదితర జన సురక్ష పథకాలను వివరించారు. బీమా పథకాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఆర్బీఐ ఎల్డీవో నవీన్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డి.నీలాద్రి, యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎస్.శ్రీనివాస్, ఎస్బీఐ ఆర్ఎం కాళిదాసు, ఏపీ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం యు.శ్రీదేవి, బ్యాంకుల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా ఉండాలి

రైస్ మిల్లుల కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు



సమావేశంలో మాట్లాడుతున్న వాసుదేవరావు

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్మికులంతా ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారించుకోగలమని రైస్ మిల్లుల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవ రావు అన్నారు. స్థానిక మహిళ భవనంలో మంగళవారం జరిగిన జిల్లా రైస్ మిల్లుల కార్మిక సంఘం సమావేశానికి గుబ్బల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. వాసుదేవరావు మాట్లాడుతూ పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో కార్మికుల మధ్య ఐక్యత లేకపోవ డం వల్ల సరైన వేతనాలు, సౌకర్యాలు పొందలేక పోతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని కోరారు. యాజమాన్యం ప్రతీ కార్మికుడికి సక్రమంగా పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించా లన్నారు. మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, జె.శ్రీనివాసరావు, వేగి రత్తయ్య, టి.వెంకటేశ్, ఆకుల ప్రసాద్, వి.సత్యనారాయణ, ఎం.లక్ష్మీనారాయణ, తమ్మా సూర్యారావు, ఎం.రామకృష్ణారావు, చింతా భాస్కరరావు పాల్గొన్నారు.



రాష్ట్ర కౌన్సిల్‌కు ఎన్నికైన శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రధానోపాధ్యాయ సంఘ రాష్ట్ర కౌన్సిల్‌కు

వేండ్ర ఉపాధ్యాయుడు శ్రీనివాస్

పాలకోడేరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘం పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఎన్నికలు మంగళవారం భీమవరంలో జరిగాయి. వేండ్ర జడ్పీ హైస్కూల్ హెచ్ఎం జీవీవీ.శ్రీనివాస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం జీవీవీ శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం ఉద్యోగునికి అపురూప వర మని, సంఘం బలోపేతానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఎం.వెంకటరమణ, శ్రీనివాస్, జె.ఏసుబాబు, ఎం.నాగబాబు, పంపన సాయిబాబు, వి.పార్వతి, సీహెచ్.రాధ, వరలక్ష్మి, విశ్వనాథరాజు, సునీల్, ఎంఎస్ శ్రీనివాస్, వివి శ్రీధర్, ఎం.నాగబాబు, శుభోసుబాబులు తదితరులు పాల్గొన్నారు.

13 స్పౌజ్, 25 మ్యూచువల్ బదిలీలు

అంతర్ జిల్లా బదిలీలకు రంగం సిద్ధం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ దంపతులతోపాటు, పరస్పర బదిలీ కోరుకునే సింగిల్ టీచర్లకోసం ఉద్దేశించిన అంతర్ జిల్లా బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి అందిన దరఖాస్తుల్లో వివిధ కేడర్లు, కేటగిరీల నుంచి మొత్తం 38 ప్రతిపాదనలు అర్హమైనవిగా తేల్చారు. వీటిలో జీవిత భాగస్వామి (స్పౌజ్) పనిచేస్తున్న జిల్లాకు బదిలీకోసం 13 దరఖాస్తులు, వేర్వేరు జిల్లాల్లో ఒకే కేడర్, సబ్జెక్టు, మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తూ అదే స్థానం (క్లియర్ వెకెన్సీ)లో పరస్పర బదిలీ కోరుకున్న సింగిల్ టీచర్ల నుంచి 25 దరఖాస్తులున్నాయి. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, హెచ్ఎం కేటగిరీల నుంచి అంతర్‌జిల్లా బదిలీకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అందిన దరఖాస్తులు, సంబంధిత టీచర్/హెచ్ఎం సర్వీసు వివరాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే అంతర్ జిల్లా బదిలీకి అర్హమైన వాటిని నిర్ధారించారు. వీటిని ఉమ్మడి జిల్లా డీఈవో ఖరారుచేసి, పాఠశాల విద్య డైరెక్టరేట్‌కు పంపగా, అన్ని జిల్లాల నుంచి అందిన ప్రతిపాదనలను క్రోడీకరించి తుది జాబితా ప్రభుత్వానికి సమర్పించినట్టు తెలిసింది. ప్రభుత్వ ఆమోదముద్ర పడిన వెంటనే బదిలీ ఆర్డర్లు జారీ అయ్యే అవకాశం ఉంది. కాగా మెగా డీఎస్సీ-2025 నియామకంలో ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్‌లు ఇవ్వకముందే అంతర్ జిల్లా బదిలీలు పూర్తిచేస్తారని సమాచారం.

అందని 108

- అందుబాటులో ఉండని అంబులెన్సులు
- షెడ్డుకు కొన్ని... రిఫరల్ కేసులకు మరికొన్ని
- వాహనాల్లో సెలైన్‌లు, లైట్లు, ఆక్సిజన్ నిల్
- సకాలంలో రాక గాల్లో కలుస్తున్న ప్రాణాలు

108 అంబులెన్సులు 28 ఉన్నాయని లెక్కల్లో చూపడమే తప్ప సేవల్లో మాత్రం శూన్యమని తెలుస్తోంది. ఆపద సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఉన్న అంబులెన్సులు కాస్త రిఫరల్ కేసులకు వెళ్ళిపోవడంతో అంబులెన్సులు అందుబాటులో ఉండడం లేదు.



ఇటీవల భీమడోలు నుంచి క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చిన వ్యాను డ్రైవర్ (ఫైల్)

గతంలో రహదారిపై ప్రమాదాలకు గురైన క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాలంటే భయపడేవారు. పోలీసులకు సమాచారం ఇస్తే వారు క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించేవారు. లేదా క్షతగాత్రుల బంధువులు చేరుకుని వారిని ఆసుపత్రులకు తమ వాహనాల్లో తరలించేవారు. సకాలంలో ఆసుపత్రులకు వెళ్ళలేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయే వారు. అర్ధరాత్రి, అపరాత్రి ఇళ్ళల్లో ఉన్న వారు అనారోగ్యం పాలైతే వారిని ఆసుపత్రికి తరలించడానికి చుట్టు పక్కల ఉన్న ఆటో డ్రైవర్లనో, దగ్గరలో ఉన్న ఏదైనా ఇతర వాహనదారులనో బ్రతిమాలి ఆస్పత్రికి తరలించే సరికే జరగాల్సిన నష్టం జరిగిపోయేది. ఈ నేపథ్యంలో 2005 ఆగస్టు 15న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 108 అంబులెన్సులను ప్రవేశపెట్టారు. 108 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయగానే అర్ధరాత్రి అయినా, అపరాత్రి అయినా, చీకటి అయినా, వర్షం అయినా 108 అంబులెన్సు సంఘటనా స్థలానికి చేరుకుంటుంది. దారి వెంబడి వెళ్ళే వాహనదారులు ప్రమాదాలకు గురై రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుంటే మేమున్నామంటూ 108 సిబ్బంది ఆపద్బాంధవుల్లా వారి వద్దకు వెళ్ళి వారిని ఆసుపత్రిలో చేర్పించి వారి వస్తువులను బంధువులకు అప్పగించేవారు. దీంతో 108 అంటే ప్రజల ప్రాణాలు కాపాడే ఆయువు పోసే వాహనాలుగా పేరొందాయి. ఇప్పుడవి మరమ్మతులకు గురై కొన్ని మూలకు చేరగా మరికొన్ని సకాలంలో సేవలందించలేకపోతున్నాయి.





ఏలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద మరమ్మతులకు గురైన అంబులెన్సులు

- ఇటీవల కామవరపుకోట మండలం ఆడమిల్లి వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకులు తీవ్ర గాయాలకు గురి కాగా క్షతగాత్రులను ఏలూరు తీసుకురావడానికి ఆలస్యంగా వెళ్ళడమే కాకుండా సెలైన్, లైట్లు, ఆక్సిజన్ లేకపోవడంతో చివరకు ఓ యువకుడి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.
- ఈ నెల 25వ తేదీ రాత్రి భీమడోలు వద్ద రోడ్డుపై నడిచి వెళ్తున్న ఒక యువకుడిని లారీ ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్సుకు కాల్ చేస్తే గంట వరకూ రాకపోవడంతో చివరకు రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న యువకుడిని అటుగా వెళ్తున్న వ్యానులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు.
- ఇటీవల ఏలూరు సమీపంలోని దుగ్గిరాల బైపాస్ వద్ద మోటారు సైకిలిస్టును కారు ఢీ కొనడంతో తండ్రి, కుమార్తె తీవ్ర గాయాలకు గురికాగా 108 అంబులెన్సు అందుబాటులో లేకపోవడంతో చివరకు మోటారు సైకిలిస్టు ఆ కుమార్తెను ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రాణాలు కాపాడారు. తండ్రిని ఆటోలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు 108 అంబులెన్సుల పనితీరు, నిర్వహణపై దృష్టి సారించాల్సి ఉంది.

ఏలూరు క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రానురాను 108 సేవలు సకాలంలో అందకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయింది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 108 అంబులెన్సులు 28 ఉన్నాయి. ఇవన్నీ గత ఐదేళ్ళుగా తిరుగుతున్న అంబులెన్సులే. మరమ్మతులతో డుగుడుగుమంటూ నడుస్తున్నాయి. పూర్తిస్థాయి ఎక్విప్‌మెంట్ లేకపోవడంతో ఈ వాహనం ఎక్కారంటే ప్రాణాలు పోవడమే అన్న రీతిలో ప్రజలకు కనిపిస్తున్నాయి. జిల్లా నలుమూలల నుంచి ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి కేసులను పంపిస్తే ఇక్కడ వైద్యులు మాత్రం ఒక్క నిమిషం ఆలస్యం చేయకుండా విజయవాడకు రిఫర్ చేస్తున్నారు. ఈ అంబులెన్సులన్నీ రిఫరల్ అంబులెన్సులుగా మారిపోయాయి. ద్వారకాతిరుమల, ఉంగుటూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు, హనుమాన్ జంక్షన్, నూజివీడు అంబులెన్సులు సైతం నిత్యం ఏలూరు నుంచి విజయవాడకు రిఫరల్ అంబులెన్సులుగా తిరుగుతూనే ఉన్నాయి. దీంతో ఈ మండలాల్లో ఎక్కడైనా ప్రమాదం జరిగి క్షతగాత్రులు రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుంటే వారికి అంబులెన్సులు అందుబాటులో ఉండడం లేదు. దీంతో ప్రజల్లో 108 అంబులెన్సులపై వ్యతిరేకత పెరిగిపోతోంది. మూడు నెలల క్రితం భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ అంబులెన్సుల నిర్వహణ బాధ్యతను చేపట్టింది. అయితే ఉన్న వాహనాలకు సరైన మరమ్మతులు లేక, సదుపాయాలు లేకపోవడంతో రోజుకు ఎక్కడో చోట అవి మరమ్మతులకు గురవుతూ పక్కన పెట్టాల్సి వస్తోంది. ప్రస్తుతం నాలుగు వాహనాలు మరమ్మతులోనే ఉన్నాయి. సకాలంలో వాహనాలు రాకపోవడంతో ప్రజలు చివరకు ప్రైవేటు వాహనాల ద్వారానే బాధితులను ఆసుపత్రులకు తీసుకువెళ్తున్నారు.

రిఫరల్ కేసులతో ఇబ్బందులు..

జిల్లాలో 28 అంబులెన్సులు ఉన్నాయి. ప్రస్తుతం కామవరపుకోట, జంగారెడ్డిగూడెం అంబులెన్సులు మేజర్ మరమ్మతులో ఉన్నాయి. కేసులు ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి రిఫరల్స్‌కు తిప్పడం వల్ల అంబులెన్సులు ఆ మండలాల్లో అందుబాటులో ఉండడం లేదు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి నిత్యం 10 నుంచి 15 కేసులు విజయవాడకు తీసుకువెళ్తున్నాం. దీని వల్ల ఐదారు అంబులెన్సులు రిఫరల్ కేసుల కోసమే కేటాయించాల్సి వస్తోంది. నడిచే పేషెంట్లను కూడా రిఫరల్ చేయడం వల్ల అంబులెన్సులో పంపాల్సి వస్తోంది. అత్యవసర ప్రమాదకర కేసులను పంపిస్తే మిగిలిన అంబులెన్సులు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ కొన్ని విభాగాల వైద్యులు లేరంటూ విజయవాడకు ఏలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి రిఫర్ చేస్తున్నారు. దీని వల్ల ఏలూరు, మండవల్లి, భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు, పెదవేగి, పెదపాడు, ఉంగుటూరు అంబులెన్సులను కూడా వినియోగించాల్సి ఉంటుంది. అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నాం. కొద్ది రోజుల్లో ఐదు కొత్త అంబులెన్సులు జిల్లాకు రానున్నాయి. దీంతో సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాం.

-దాసరి రాజు, జిల్లా మేనేజర్, 108 అంబులెన్సుల నిర్వహణ

రెండో విడతలో 33 మంది డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఓకే

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 సెలక్షన్ జోన్ పరిశీలనకు వచ్చిన అభ్యర్థులకు రెండో విడత కాల్ లెటర్ల జారీ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మంగళవారం జరిగాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆయా కేడర్లు, సబ్జెక్టుల నుంచి అర్హతలు కలిగిన 33 మందికి కాల్ లెటర్లను విద్యాశాఖ జారీచేయగా, స్థానిక సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలనను మొత్తం 4 కౌంటర్లలో నియమించిన టీమ్‌లు నిర్వహించాయి. రెండో విడతలో ఆరుగురు ఫిజికల్లీ హ్యాండీకాప్డ్ అభ్యర్థులుండగా, అకడమిక్ సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం వీరిని వైకల్య నిర్ధారణ నిమిత్తం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ బోర్డుకు రిఫర్ చేశారు. మొదటి విడతలో 1034 మంది అభ్యర్థులకు, రెండో విడతలో 33 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరిగింది. తొలి విడత ధ్రువపత్రాల పరిశీలనకు గైర్హాజరైన అభ్యర్థులు, వివిధ కారణాలతో సెలక్షన్ జోన్ పరిశీలన నుంచి తిరస్కారానికి గురైన అభ్యర్థుల స్థానే తదుపరి మెరిట్ అభ్యర్థులను గుర్తించి మూడో విడత కాల్ లెటర్ల జారీ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను త్వరలో చేపడతారని తెలిసింది. ఇటువంటి అభ్యర్థులు సుమారు 10 మంది ఉండవచ్చునని సమాచారం. ఉమ్మడి జిల్లాలో పాఠశాల విద్య, ట్రైబల్ వెల్ఫేర్, జువనైల్ వెల్ఫేర్ శాఖల నుంచి మొత్తం 1074 పోస్టులను మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు నోటిఫై చేసిన విషయం విదితమే. రెండో విడత కాల్‌లెటర్లు అందుకున్న 33 మంది అభ్యర్థులు మంగళవారం సర్టిఫికెట్ల వెరిఫి కేషన్‌కు హాజరయ్యారని, మూడోవిడత కాల్‌లెటర్ల జారీగురించి సమాచారం తెలియదని ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

అభివృద్ధి పనులపై జడ్పీ చైర్‌పర్సన్ సమీక్ష

ఏలూరు సిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఉమ్మడి పశ్చిమగోదావరి జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకం కింద చేపట్టిన రహదారుల పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎంజీఎస్‌వై కింద ప్రతి గ్రామానికి అన్నికాలాల్లో రహదారి కనెక్టివిటీ కల్పించాలన్నారు. అదే విధంగా పీఎంజీఎస్‌వై కింద ఎంపిక చేసిన గ్రామాలను మోడల్ విలేజ్‌లుగా అభివృద్ధి చేయాలన్నారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులను పునరుద్ధరణ పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఎస్ఈ, ఈఈ, డీఈఈలు, ఇతర సాంకేతిక అధికారులు పాల్గొన్నారు.

రూ. 10.80 లక్షల విలువైన ఎరువుల సీజ్

ఏలూరు/ తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు దాడులు చేసి భారీగా ఎరువులు సీజ్ చేశారు. డీఎస్పీ సింగలూరు వెంకటేశ్వరరావు మంగళవారం ఆధ్వర్యంలో చాట్రాయి మండలం చనుబండలో లక్ష్మివెంకటేశ్వర మెన్యూర్, డెక్కన్ ఆగ్రో కెమికల్స్, తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో విజయ ట్రేడర్స్, వెంకటేశ్ మెన్యూర్ డిపోల్లో తనిఖీలు చేయగా, నాలుగు షాపుల నుంచి 10 లక్షల 80వే762 విలువైన 53.565 టన్నుల ఎరువుల వ్యత్యాసాన్ని గుర్తించి సీజ్‌చేశారు. విజిలెన్స్ ఇన్ స్పెక్టర్ పి.శివరామకృష్ణ, ఏవో జి.మీరయ్య, విజిలెన్స్ ఎస్ఐలు సీహెచ్ రంజిత్ కుమార్, కె.సీతారామ్‌లు పాల్గొన్నారు.



మొగల్తూరులో చించివేసిన ఫ్లెక్సీ.. ఆందోళన వ్యక్తం చేస్తున్న యువత

డిప్యూటీ సీఎం పవన్ ఫ్లెక్సీల ధ్వంసం

- సీసీ పుటేజ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్/మొగల్తూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు వేర్వేరుచోట్ల డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఫ్లెక్సీలను దుండగులు ధ్వంసం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో పవన్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వసం చేశారు. జనసేన నాయకుల ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. ప్రసాద్ సంఘటనా స్థలంలోని సీసీ పుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోట వంతెన వద్ద ఏర్పాటు చేసిన పవన్ ఫ్లెక్సీని సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వసం చేశారు. దీంతో స్థానిక యువకులు పులపర్తి రాంబాబు, ఆకన ప్రకాశ్, రవీంద్ర, శ్రీసాయి, బాలాజీ పవన్, శుభాష్, మురళీ తదితర అభిమానులు ఆందోళన నిర్వహించారు. మొగల్తూరు ఎస్ఐ వాసుకు ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



దగ్ధమవుతున్న కారు.. మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కారు నుంచి మంటలు.. క్షణాల్లో దగ్ధం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వెళ్తున్న కారు ఇంజన్ నుంచి అకస్మాత్తుగా మంటలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై రోడ్డుపై నిలిపివేశాడు. వెంటనే వారు కారు నుంచి దిగడంతో కళ్లముందే క్షణాల్లో ఇంజన్ దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడ జరిగిన మంటలను అదుపు చేశారు. ఏలూరు మంచినీళ్ళతోటనకు చెందిన కురేళ్ళ సుబ్బారావు రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి తన కుమారుడు కారు వేసుకుని మంగళవారం రాత్రి అశోక్‌నగర్ నుంచి ఫైర్‌స్టేషన్‌కు వస్తుండగా మార్గమధ్యలో అమీనాపేట సోనో విజన్ వద్దకు వచ్చేసరికే ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లా అదనపు అగ్నిమాపక శాఖాధికారి రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పండుగలకు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వివిధ పండుగలను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించారు.మరికొన్నింటిని పొడిగిస్తున్నట్టు వెల్లడించారు. రైల్ నెంబర్ 07027 చర్లపల్లి - బ్రహ్మాపూర్ (ప్రతి శుక్రవారం) ఈ నెల 5వ తేదీ నుంచి నవంబరు 28 వరకు నడపనున్నారు. 07028 బ్రహ్మాపూర్ - చర్లపల్లి (ప్రతి శనివారం) 6 నుంచి నవంబరు 29 వరకు, 07225 చర్లపల్లి - షాలిమర్ (కోల్‌కత్తా) ప్రతి సోమవారం 1 నుంచి అక్టోబర్ 13 వరకు, 07226 షాలిమర్ - చర్లపల్లి (ప్రతి మంగళవారం) 2 నుంచి అక్టోబరు 14 వరకు, 08439 పూరి - పాట్నా(ప్రతి శనివారం) ఈ నెల 13నుంచి నవంబర్ 29 వరకు నడపనున్నారు. 08440 పాట్నా - పూరీ(ప్రతి ఆదివారం(14 నుంచి నవంబరు 29 వరకు, 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్(ప్రతి శనివారం) ఈ నెల 13 నుంచి నవంబర్ 29 వరకు, 02812 యశ్వంత్‌పూర్-భువనేశ్వర్(ప్రతి సోమవారం) సెప్టెంబర్ 15 నుంచి డిసెంబరు 1 వరకూ నడపనున్నారు. 08581 విశాఖపట్నం - ఎస్ఎంవిటి బెంగళూరు (ప్రతి ఆదివారం) ఈ నెల 14 నుంచి నవంబరు 31 వరకు, 08582 ఎస్ఎంవీటీ బెంగళూరు - విశాఖపట్నం(ప్రతి సోమవారం) ఈ నెల 15 నుంచి డిసెంబర్ 1వరకు, 08547 విశాఖపట్టణం - తిరుపతి (ప్రతి బుధవారం)అక్టోబరు 1 నుంచి నవంబరు 26 వరకు, 08548 తిరుపతి - విశాఖపట్టణం (ప్రతిగురువారం) అక్టోబరు 2 నుంచి నవంబరు 27 వరకు, 08579 విశాఖపట్టణం - చర్లపల్లి (ప్రతి శుక్రవారం) అక్టోబర్ 3 నుంచి నవంబరు 28 వరకు, 08580 చర్లపల్లి - విశాఖపట్టణం(ప్రతిశనివారం)అక్టోబరు 4నుంచి నవంబరు 29వరకు నడపనున్నారు.07219 నర్సాపూర్ - తిరువన్నమల్లయ్ (ప్రతి బుధవారం) అక్టోబర్ 1,8,22, నవంబర్ 5,19,26 తేదీల్లో, 07220 తిరువన్నమల్లయ్ - నర్సపూర్ (ప్రతిగురువారం) అక్టోబర్ 2, 9, 23 నవంబర్ 6, 20, 27 తేదీల్లో, 06055 పోదనూరు - బరోనీ (ప్రతి శనివారం) సెప్టెంబర్ 6 నుంచి 29 వరకు, 06056 బరోనీ - పోదనూరు(ప్రతి మంగళవారం)ఈ నెల 9 నుంచి డిశంబరు 2 వరకు నడపనున్నారు. 06063 కోయంబత్తూర్ - ధన్‌బాగ్ (ప్రతి శుక్రవారం) ఈ నెల 5 నుంచి నవంబరు 28 వరకు, 06064 ధన్‌బాగ్ - కోయంబత్తూర్ (ప్రతి సోమవారం) ఈ నెల 8 నుంచి డిసెంబరు 1 వరకు, 06077 చెన్నై సెంట్రల్ - సత్రగంజి (ప్రతి శనివారం) ఈ నెల 6 నుంచి సెప్టెంబర్ 27 వరకు, 06078 సత్రగంజి - చెన్నై సెంట్రల్ (ప్రతి సోమవారం) ఈ నెల 8 నుంచి సెప్టెంబరు 29 వరకు నడపనున్నట్టు అధికారులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడిని కాపాడేందుకు యత్నం

- వైసీపీ నాయకుడికి దేహశుద్ధి చేసిన స్థానికులు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడ్ని కాపాడేందుకు వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామినేని నాని యత్నించాడని బాధితులు ఆరోపించారు. దెందులూరు మండలానికి చెందిన బాలికను అప్పట్లో వైసీపీ పాలనలో వలంటీరుగా ఉన్న యువకుడు గర్భవతిని చేశాడు. ఈ ఘటనపై 2023లో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ప్రస్తుతం కేసు ఏలూరు కోర్టులో విచారణ సాగుతోంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న వలంటీరు కామినేని నాని అనుచరుడు కావడంతో కాపాడడానికి బాలిక కుటుంబంపై బెదిరింపులకు పాల్పడ్డాడు.మంగళవారం ఉదయం ఆ బాలిక తండ్రి పొలం వెళ్లి తిరిగి వస్తుండగా కామినేని నాని అడ్డగించి కేసు రాజీ చేసుకోవాలంటూ దాడి చేశారు. అదే సమయంలో అటుగా వస్తున్న టీడీపీ నాయకులు, స్థానికులు అక్కడకు చేరుకుని బాలిక తండ్రిని సంరక్షించారు. బాలిక తండ్రిని ఇనుప రాడ్డుతో నాని కొట్టడంతో తల పగిలిపోయింది. ఆగ్రహించిన స్థానికులు నానికి దేహశుద్ధి చేసినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం బాధితురాలి తండ్రి ఏలూరులోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈసంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేయడంతో పోలీసులు బాధితుడి నుంచి వాగ్మూలం నమోదు చేశారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ.. తప్పిన ముప్పు



జీలుగుమిల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ప్రతిభ పాఠశాల బస్సును లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు లారీ ఢీకొట్టింది. మంగళవారం ఉదయం విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్లే క్రమంలో రోడ్డుపై పాఠశాల బస్సును డ్రైవర్ హఠాత్తుగా స్లో చేశాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో లారీని తప్పించబోయి వెనుక వచ్చే లారీ పాఠశాల బస్సుకు తగి లింది. దీంతో పెద్దగా శబ్దం రావడంతో స్థానికులు ఆ ప్రాంతంలో గుమిగూడారు. అప్రమత్తమై విద్యార్థులకు ధైర్యం చెప్పారు. డ్రైవర్ స్కూల్ బస్సును రోడ్డుపై ఆపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పలువురు భావిస్తున్నారు.

మోటార్ సైకిల్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

జీలుగుమిల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. కామయ్యపాలేనికి చెందిన పావురాల మహేశ్ బైక్‌పై జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ డ్రమ్ములను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన మహేశ్‌ను 108వాహనంలో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించారు.

బిస్కెట్ ప్యాకెట్ అనుకుని

యాసిడ్ పౌడర్ తిన్న చిన్నారి!

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- స్కూల్ యాజమాన్యాన్ని నిలదీస్తున్న బంధువులు
- విజయవాడ ఆస్పత్రిలో చిన్నారికి వైద్యం

పాలకొల్లు టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): హార్పిక్ యాసిడ్ పౌడర్ తిన్న నాలుగేళ్ల చిన్నారి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. పట్టణంలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పట్టణంలోని బుధవారపు వీధికి చెందిన చిన్నారి తల్లిదండ్రులు మామిడిపల్లి అనుదీప్, సంయుక్తలు ఈ విషయాన్ని మంగళవారం విలేకర్లకు తెలిపారు. తమ కుమార్తె ఓ ప్రైవేటు స్కూల్లో ఎల్‌కేజీ చదువుతోందని, గత గురువారం స్కూల్‌కు వెళ్లిన పాపకు బ్యాగ్‌లో బిస్కెట్ ప్యాకెట్ వేసి పంపామని తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో స్కూల్ నుంచి పాపకు అస్వస్థతగా ఉంది, ఆసుపత్రికి తీసుకెళ్తున్నామని ఫోన్ వచ్చిందన్నారు. ఆసుపత్రికి వెళ్లగా అక్కడ వైద్యులు చికిత్స అనంతరం ఇక్కడ కష్టమని,మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తీసుకెళ్లమని సూచించడంతో విజయవాడ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. అసలు స్కూల్లో ఏం జరిగిందోనని ఆరా తీస్తే స్కూల్ బ్రేక్ సమయంలో బిస్కెట్ అనుకుని హార్పిక్ యాసిడ్ పౌడర్ తినేసిందని, నోటి నుంచి రక్తం వచ్చినట్టు, చిన్నారికి నాలుక, పేగులు గొంతు లోపల భాగం కాలిపోయిందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ప్రస్తుతం చిన్నారికి పైపుల ద్వారా వైద్యులు ఆహారం అందిస్తున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు. ఇప్పటి వరకూ సుమారు రూ.1.50 లక్షలు ఖర్చయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఘనటపై స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే 'మీ పాపే ఆ ప్యాకెట్ తెచ్చుకుంది'అని బుకాయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ టీవీ ఫుటేజ్ తీయాలని పట్టుబడితే స్కూల్ నిర్వాహకులు ఎదురు వాదనకు దిగుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై విజయవాడలో కేసు నమోదు చేయించినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

మహిళ మెడలో సూత్రపుతాడు చోరీ

పెనుమంట్ర, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నత్త రామేశ్వరంలో మహిళ మెడలోని సూత్రాల తాడు లాక్కుని ఓ దుండగుడు ఉడాయించాడు. మంగళవారం ఉదయం ఐదున్నర గంటలకు నత్తారామేశ్వరం గ్రామానికి చెందిన కడలి లక్ష్మి ఉదయం కిరాణా షాపు ముందు తుడుస్తుండగా ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి మహిళ మెడలోని సూత్రాలు తాడు తెంపుకుని పారిపోయారు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నరసాపురం డీఎస్పీ శ్రీవేద ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో జ్వరాలను అరికట్టాలంటూ వినతి

కుక్కునూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అమరవరం పీహెచ్‌సీ పరిధిలో జ్వరాలను అరికట్టేందుకు వైద్యసిబ్బంది కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపందా ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్‌కే.గౌస్ మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు విపరీతంగా ఉన్నాయని తద్వారా విషజ్వరాలు పెరుగుతున్నాయన్నారు.గ్రామాల్లో దోమల నివారణకు మందులు పిచికారి చేయడంలేదని, దోమతెరలు ఇవ్వడంలేదని దీని ద్వారా జ్వరాలు పెరుగుతున్నాయని అరికట్టాలన్నారు.

పవిత్రోత్సవాలు ప్రారంభం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 5వ తేదీ వరకు జరిగే స్వామివారి 24వ వార్షిక పవిత్రోత్సవ పూజలు మంగళవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. శ్రీమత్ విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, తీర్థప్రసాద గోష్ఠిని ఆలయ ప్రధానార్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, టీటీడీ స్వర్ణపతక గ్రహీత కిళాంబి వేంకట పవనకృష్ణమాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఆలయ ఈవో నల్లూరి సతీశ్ కుమార్ తగు ఏర్పాట్లు చేశారు.

విడిభాగాల తయారీపై విద్యార్థినులకు అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులు మంగళవారం సత్రంపాడులోని పారిశ్రామిక వాడలోని పలు కర్మాగారాలను సందర్శించారు. సీసా మూతలు, కవర్లు, పాలిథిన్ ఉత్పత్తులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తదితర పరికరాలను తయారు చేసే యూనిట్లను పరిశీలించారు. కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ శ్రీలత మాట్లాడుతూ నిత్యం వినియోగించే వస్తువులు, వాటి విడిభాగాల తయారీపై విద్యార్థినులకు అవగాహన కోసమే క్షేత్రస్థాయి సందర్శనను నిర్వహించామన్నారు. అధ్యాపకులు దీప్తిభార్గవ, మాధురి రోజ్ పాల్గొన్నారు.

కోరం లేక వాయిదాపడిన గ్రామసభ

బుట్టాయగూడెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూములు సేకరించడానికి మంగళవారం రెడ్డిగణపవరంలో సర్పంచ్ తెల్లం జయమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. సీపీఎం మండల నాయకులు కోర్స జలపాలు, పి.మంగరాజు మరికొందరు గ్రామసభ గురించి ప్రజలకు ఎలాంటి సమాచారం లేదంటూ అధికారులను నిలదీశారు. గ్రామసభ నిర్వహణను గ్రామస్థులు వ్యతిరేకించడంతో సభకు కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ ప్రకటించారు. తదుపరి గ్రామసభ గురించి అందరికీ తెలియజేస్తామన్నారు. అలాగే ఆర్అండ్ఆర్ భూసేకరణ గ్రామ సభకు ఆర్డీవో, తహసీల్దార్ స్థాయి అధికారులు రాకుండా స్థానిక వీఆర్‌వోను పంపడంపై సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ అభ్యంతరం తెలిపారు. గిరిజన చట్టాలకు లోబడి గ్రామసభలు నిర్వహించాలన్నారు. వీఆర్‌వో జెన్నిఫర్, ఉప సర్పంచ్ బొమరాజు సత్యనారాయణరాజు, పి.నాగేశ్వరరావు, వి.వీరయ్య, ఎ.ఫ్రాన్సిస్, జి.పవన్, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై అశ్రద్ధ వద్దు : హేమలత



ఏలూరు రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కంటి సమస్యలను అశ్రద్ధ చేస్తే చూపు పోయే ప్రమాదం ఉందని, ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు హేమలత అన్నారు. ఏలూరు రవికిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామంలో కళ్యాణ మండపం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ నేతల రవి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా డాక్టర్ హేమలత మాట్లాడుతూ నేత్రాల్లో ఉండే శుక్లాలు, రెటీనా సంబంధిత వ్యాధులు నల్ల గుడ్డు సంబంధించిన ఇబ్బందులు తదితర అంశాలపై తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. బీపీ, షుగర్, పరీక్షలు నిర్వహించి వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు పరదేశి కుమార్, పంచాయితీ కార్యదర్శి జగదీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సొసైటీలో చైర్మన్ సోంబాబును సన్మానిస్తున్న సభ్యులు

సొసైటీలకు వైభవం తీసుకురావాలి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు

టి.నర్సాపురం, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం సొసైటీకి నూతన కమిటీ పూర్వపు వైభవం తీసుకురావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. టి.నర్సాపురం సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా జోనుబోయి సోముబాబు, పర్సన్‌లు మోదుగా వెంకటరామరావు, ఉయ్యూరి వెంకట నాగమణిలు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన సొసైటీ తీవ్రనష్టాల్లో నిలిచిందని నష్టాలను అధికమించి పూర్వపు వైభవం తీసుకురావాలని నూతన కమిటీకి సూచించారు. ఛైర్‌పర్సన్ సోముబాబు మాట్లాడుతూ రైతులకు అవసరమైన పంటరుణాలు, గడువు ముగిసిన డిపాజిట్లు, డిపాజిట్ దారులకు డిపాజిట్‌లు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సిబ్బంది బాధ్యతయుతంగా పని చేయాలని సూచించారు. సంఘ సభ్యులు రైతులందరి సహకారంతో సంఘాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఛైర్‌పర్సన్‌గా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, నాయుడు ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, అప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, శీలం వెంకటేశ్వరరావులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సొసైటీ సిబ్బంది, పలువురు రైతులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాణి, కొల్లి మురళీ, అద్దంకి జగ్గారావు, నీటిసంఘం అధ్యక్షులు కొనకళ్ల మోహన్‌కుమార్, వేములయ్య, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

టి.నర్సాపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రంగస్థల కళాకారులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణసౌకర్యం కల్పించాలని జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్.కృష్ణబాబు, సీనియర్ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణలు మంగళవారం ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయం కోసం రంగస్థల కళాకారులు ప్రచారం ద్వారా ఎంతో కృషి చేశారని వారు తెలిపారు.2014 - 19 వరకు నాటి ప్రభుత్వం అమలు చేసిన ప్రజాసంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం జన్మభూమి గ్రామదర్శిని, నగర దర్శిని, తదితర వేదికలపై కళారూపాల ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు అవగాహన కల్పించింది కళాకారులేనని ప్రభుత్వానికి వెన్నంటి ఉండే రంగస్థల కళాకారులందరికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఎల్.ఆర్.కృష్ణబాబు, సత్యనారాయణలు కూటమి ప్రభుత్వాన్ని కోరారు.

ఆయిల్‌పామ్ రైతులకు న్యాయం చేస్తాం : ఎంపీ

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ రైతులు నష్టపోకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర మంత్రి యువరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఎంపీ మహేశ్ రాసిన లేఖకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మహేశ్ మాట్లాడుతూ క్రూడ్ పామాయిల్ ధరల విషయంలో రైతుల ప్రయోజనాలు పరిగణలోకి తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని అన్నారు. రైతుల ప్రయోజనాలు కేంద్రం పరిగణలోకి తీసుకుంటుందన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : చిర్రి

కుక్కునూరు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ద్వారానే ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో పాటు అభివృద్ధి జరుగుతుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. మంగళవారం కుక్కునూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతీ ఒక్కరికి కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో ఎన్నుడూ లేని విధంగా విద్యా, వైద్యం, రహదారుల ఏర్పాటు తదితర పనులు కోట్లాది రూపాయలతో జరుపుతున్నట్లు తెలిపారు. కాగా అంతకు ముందు ఇటీవల పాముకాటుకు గురైన జనసేన మండల ఉపాధ్యక్షుడు మంత్రి గోపాలకృష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించి త్వరగాకోలుకోవాలని ఆకాంక్షించారు.

రోడ్లు వర్షార్పణం

(5వ పేజీ తరువాయి)

దానిపై ప్రాథమిక అంచనాలను కలెక్టర్‌కు ఆర్అండ్‌బీ అధికారులు నివేదించారు. కైకలూరులో 15 కిలోమీటర్లు పూర్తిగా కోతకు గురైందని, ముంపు మండలాలు కుక్కునూరు, వేలేరుపాడుతోపాటు సమీప మండలాల్లో ఆరు కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్లు లెక్కలు తేల్చారు. ఇంకా గోతుల్లో వరద నీరు ఉండడం వల్ల వారం రోజుల తర్వాతే తుది అంచనాలు సిద్ధం చేసే అవకాశాలున్నాయి. కలెక్టర్‌కు ప్రాథమిక నివేదిక ఇచ్చామని, వర్షాలు తగ్గుముఖం పట్టాక అంచనాలు వేసి పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసే అవకాశాలు వున్నాయని జిల్లా రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ విజయరత్నం తెలిపారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్

పోలవరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం గూటాల గ్రామంలో మంగళవారం కూటమి నేతల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు ఏనుగుల శ్రీనివాస్, నున్న నరసింహరావు, జనసేన ఐటీ వింగ్ కో ఆర్డినేటర్ ఆటపాకల వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు కరిబండి నాగరాజు, కరిబండి శ్రీను, జల్లేపల్లి శివసూర్యనారాయణ, సంబా సత్యనారాయణ, కొంజర్ల సత్యన్నారాయణ, కొవ్వేటి సత్యనారాయణ, పాదం శ్రీనివాసరావు, తాళ్ళపూడి వెంకటేశ్వరరావు, తోట సాయి, పెద్దేహపు నాగభద్రం, పలకంశెట్టి అయ్యప్ప, తోట బాలయోగి, వీఆర్వో బి.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: మండలంలోని అన్ని గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను కూటమి నేతలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎటువంటి రాజకీయ నాయకుల ఫొటోలు, రంగులు లేని పూర్తి పారదర్శకంగా ప్రభుత్వ చిహ్నంతో ఉన్న కార్డులను తిమ్మాపురం, పావులూరివారిగూడెం, రామన్నగూడెం తదితర గ్రామాల్లో నేతలు లబ్ధిదారులకు అందజేశారు. తిమ్మాపురం ఎంపీటీసీ కొయ్యలమూడి సరిత చంటియ్య, నేతలు ఘంటా శ్రీనివాసరావు, రామన్నగూడెం సొసైటీ ఛైర్మన్ మద్రాస్ రాము, పావులూరి మధు, ఏపూరి కిషోర్, వాసిరెడ్డి నరసింహరావు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం:రేషన్ పంపిణీలో పొరపాట్లను సరిదిద్ది అక్రమాలను అరికట్టడానికి స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కృష్ణాపురంలో ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు, సీఎస్ఆర్ఐ కె.పద్మ, నాయకులు మొగపర్తి సోంబాబు, గద్దె అబ్బులు, దొమ్మేటి జనార్ధన్, పొట్ట రామారావు, మడకం కన్నపరాజు, కుందుల శ్రీను, గజ్జెల కన్నారావు పాల్గొన్నారు.

● నిడమర్రు: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం పెదనిండ్రకొలనులో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మండలంలో 31 రేషన్ షాపులు 15వేల స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని తొలిరోజు 400 కార్డులు పంపిణీ చేశామన్నారు. సివిల్ సప్లయ్ డీటీ షేక్ మల్లికా జరీనా, స్థానిక సర్పంచ్ ముగ్గళ్ల యాకోబు పాల్గొన్నారు.

● కామవరపుకోట: తహసీల్దార్ గెడ్డం ఎలీషా సూచనలతో మంగళవారం తడికలపూడిలో స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామ రెవెన్యూ పరిపాలన అధికారులు మాదు లక్ష్మీనారాయణ, బి.రమేష్‌లు పంపిణీ చేశారు. కూటమి నాయకులు తూతా బాలాజీ, బొంతు వెంకటేశ్వరరావు, తూతా లక్ష్మణరావు, మొట్టికాయల నాగయ్య, సుందరరావు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: శనివారపుపేటలో మంగవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ప్రజలకు నూతన సాంకేతికత ద్వారా సౌకర్యవంతమైన, పాదర్శకత ద్వారా సౌకర్యవంతమైన, పారదర్శకమైన రేషన్ పంపిణీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ 26వ డివిజన్ ఇంచార్జి సి.హెచ్.గణేష్, మాజీ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు అన్నారు. వీఆర్వో, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ పుట్టిన రోజు వేడుకలు



దెందులూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

పెదపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని పునుకొల్లు ప్రాథమిక పాఠశాలలో జనసేన నాయకులు నోట్‌పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలను మంగళవారం అందజేశారు. జనసేన నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో జనసేనాని తనకంటూ ఒక గుర్తింపును,ప్రత్యేకతను చాటుకుంటున్నారని అన్నారు.

● జీలుగుమిల్లి: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకలు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ మండల జనసేన, టీడీపీ అధ్యక్షులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయికి ఎమ్మెల్యే కేక్ కట్ చేసి తినిపించారు. సీటీఆర్ఐ ఎదురుగా జాతీయ రహదారి పక్కన అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కూటమి నాయకులు కలిసి శంకుస్థాపన చేశారు. గడ్డమణుగు రవికుమార్ తల్లిదండ్రులు సత్యనారాయణమూర్తి, శకుంతల జ్ఞాపకార్థం అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడాన్ని కొనియాడారు.

● టి.నరసాపురం: రాజుపోతేపల్లి అడ్డరోడ్డు వద్ద ఉన్న కె.జగ్గవరం సొసైటీ పెట్రోల్ బంకు వద్ద జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు సొసైటీ ఛైర్‌పర్సన్ బొంతు సత్యనారాయణ అధ్యక్షతన, తిరుమలదేవిపేటలో తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టి.నర్సాపురం జనసేన పార్టీ మండలాధ్యక్షులు మధ్యాహ్నపు వారిగూడెం సొసైటీ ఛైర్‌పర్సన్ అడపా నాగరాజు, సొసైటీ పర్సన్‌లు పేరాబత్తుల జగన్, బాల విఘ్నేశ్వరరావు, పొలిమేర వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు బండి శ్రీనివాస్, వీరవెంకయ్య పాల్గొన్నారు.

● లింగపాలెం: జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను లింగపాలెం మండలంలో ఘనంగా జరిగాయి. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు పి.మహేశ్ బాబు, కూటమి నేతల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు, కాలనీలలో ఉన్న వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. మాదాసు కృష్ణ, చల్లా నాగబాబు,పూజారి సురేశ్, ముదికొండ వంశీగోపి, మోదుగు అంజిబాబు,పఠాన్‌సుబానీ, పొదిల మహేశ్‌పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా నగరంలో పలు ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేసి అన్న సమారాధనను నిర్వహించారు. స్థానిక గజ్జెల వారి చెరువు వద్ద ఏలూరు సిటీ వైడ్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ పూల శ్రీను ఆధ్వర్యంలో అన్నదానాన్ని ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నారా శేషు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు. బుట్టాయగూడెం బస్టాండ్ సెంటరులో జనసైనికులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం రాంబాబు కట్ చేసి అందరికి పంచారు. నాయకులు ఎం.బుచ్చిరాజు, సోడెం రాజు, శివ, కైకాల సూరిబాబు పాల్గొన్నారు.

● పోలవరం: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజులు వేడుకలను మంగళవారం పోలవరం మండల జనసేన నాయకులు ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు పండ్లు , బ్రెడ్లు పంపిణీ చేశారు.జనసేన పార్టీ మండలాధ్యక్షులు గునపర్తి చిన్ని, కొణతాల ప్రసాద్, కొణతాల సురేశ్ బాబు, తెలగంశెట్టి రాము, చీకట్ల సాయి, బండి బాబి, మామిడిపల్లి స్వాతి పాల్గొన్నారు.



రాజుపోతేపల్లి పెట్రోల్‌బంకు వద్ద కేక్ కట్ చేస్తున్న దృశ్యం

● భీమడోలు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. ఆగడాలలంక, పూళ్ల, సూరప్పగూడెం, గుండుగొలను తదితర గ్రామాల్లో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. గుండుగొలనులో శ్రీ విఘ్నేశ్వరదివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేశారు.

● నిడమర్రు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తోకలపల్లి, పెదనిండ్రకొలను, భువ్వనపల్లిలో జరిగిన కార్యక్రమాలలో పాల్గొని జనసేన నాయకులు, కార్యకర్తలు, ఫాన్స్ మధ్య కోలాహలంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. భువ్వనపల్లిలో పార్టీ గ్రామాధ్యక్షులు అల్లుమోలు అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు.

● దెందులూరు: పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన నియోజకవర్గ నాయకులు కొఠారు ఆదిశేషు, లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అన్ని గ్రామాల్లో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. కొవ్వలి,గాలాయగూడెం గ్రామాల్లో జనసేన పార్టీ స్థూపాలను ఆవిష్కరించారు. పోతునూరులో పండూరి దుర్గాప్రసాద్ కోడే సత్య నారాయణ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. జనసేనపార్టీ కార్యాలయ ఇన్‌చార్జి తిరుపతి వాసు కార్యకర్తలు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా,మానసికంగా వేధింపులకు గురి చేస్తున్న భర్తపై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. లింగపాలెం మండలం గోకవరం పంచాయితీ పచ్చనాగారం గ్రామానికి చెందిన కటికనేని గోపీనాథ్(30)కి 2018లో ముసునూరు గ్రామానికి చెందిన లక్ష్మీ సౌజన్య అనే యువతితో వివాహమైంది. ఇచ్చిన కట్నకానుకలు చాలలేదని అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా లక్ష్మీసౌజన్యను గోపీనాథ్ వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ ఎం.సుబ్బారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ వర్ధంతి

ఏలూరు రూరల్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు ముడివేసి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత వైఎస్సార్ చిత్రపటానికి, ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నేరుసు చిరంజీవి, పల్లి శ్రీను, రాజేష్, జాన్ గురునాథ్, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, దాసరి రమేష్, జిజ్జువరపు విజయ నిర్మల, ఇనుపనూరి జగదీశ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు తోడ్పడతాం

పెదపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ వారి ఆదేశాల ప్రకారం మిషన్ శక్తిలో భాగంగా 10రోజుల పాటు అవగాహన నిర్వహించి, మహిళా సాధికారతకు అన్నివిధాలా తోడ్పడుతామని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి శారద తెలిపారు. వట్లూరు టీటీడీసీ సమీపంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ మహిళల అభివృద్ధి శిక్షణ సంస్థ కార్యాలయం వద్ద స్వయం సహాయక సంఘాల సభ్యులు మంగళవారం అవగాహన కల్పించారు. మిషన్ వాత్సల్య ద్వారా అమలు జరుగుతున్న కార్యక్రమాల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొవాలని శారదా తెలిపారు.జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ తులసీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి, యూనియన్ బ్యాంక్ గ్రామీణ యువత ఉపాధి మహిళా శిక్షణా సంస్థ కో-ఆర్డినేటర్ డి.శిరోమణి, అన్నపూర్ణాదేవి, రాఘవమ్మ, రాజు, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేవుల వద్ద పోలీసుల బందోబస్త్

పోలవరం, సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రమాద రహితంగా జరుపుకోవాలని పోలవరం ఎస్ఐ సూచించారు.మంగళవారం పోలవరం, పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ గ్రామాలలో ఫెర్రీ రేవులలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తుని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల ఆలయ కమిటీ నిర్వాహకులతో మాట్లాడుతూ నిమజ్జనాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వివిధ ఘటనల్లో మృతి చెందిన విషయాలు గుర్తు చేసి ఎలాంటి గొడవలకు అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిబంధనలకు లోబడి ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు.

సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ

చింతలపూడి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఐ కార్యాలయంలో సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ మంగళవారం జరిగింది. సీపీఐ జిల్లా నాయకులు మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కమ్యూనిస్టుల పునర్వ్యవస్థీకరణ జరిగినప్పుడే సుధాకరరెడ్డికి ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. విద్యార్థి దశ నుంచి ఆయన సాధించిన పోరాడిన విషయాలు వివరించారు. జాతీయ రాజకీయాల్లో పార్లమెంటు సభ్యుడిగా పనిచేస్తున్నప్పుడు జాతీయ ఉపాధి పథకం రూపకల్పనలో సభ్యుడిగా ఉన్నారన్నారు. ఎం.వసంతరావు, పాండురంగారావు, రంగనాథ్, టి.బాబు, నాయకులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణ

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): భాద్రపదమాసం మంగళవారం కావడంతో సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు సామూహికంగా మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. స్వామివారిని తమలపాకులు, సిందూరంతో కొలిచారు. ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ, అర్చకులు శ్రీనివాసుల శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఏపీ రాజధాని అమరావతి హైకోర్టు న్యాయమూర్తి సి.హెచ్.శరత్ చంద్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోత్రనామాలతో అర్చనలు జరిపారు. అంబికా ఆలయ మేనేజర్ ఓలేటి మల్లికార్జునరావు బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

ప్రతి మహిళ విద్యనభ్యసించాలి

● అవగాహన కార్యక్రమంలో వక్తలు

నిడమర్రు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ అక్షరాస్యత సాధిస్తే కుటుంబాన్ని ముందుకు నడిపించగలదని వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆర్.విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం నిడమర్రు వెలుగు కార్యాలయంలో జరిగిన ఉల్లాస్ వయోజన విద్య వలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ అక్షరాస్యతలో ప్రతిమహిళ అక్షర జ్ఞానంతో పాటు క్రియాత్మక విద్య, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, న్యాయ విద్య అంశాలను నిరక్షరాస్యులకు బోధించడం జరుతుందన్నారు. ఏపీఎం రత్నకుమార్, ఎంపీడీవో విజయకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

పెదవేగి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రబలే సీజనల్ వ్యాధులపట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ప్రత్యూష అన్నారు. పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) లో మంగళవారం ఆశాడే కార్యక్రమం నిర్వహించారు.సీజనల్ వ్యాధులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.




రేచర్ల వద్ద సర్వీసు రోడ్డు వేయాలని కోరుతున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీసు రోడ్లు వేయండి

» రైతు సంఘాల నాయకుల ఆందోళన

చింతలపూడి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీసు రోడ్ల సౌకర్యం కల్పించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతులు డిమాండ్ చేస్తూ రేచర్ల వద్ద భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కొద్దిసేపు రైతులకు సర్వీసు రోడ్ల సమస్య పరిష్కరించాలని నినాదాలు చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు వేసినా దిగువ గ్రామాలకు సర్వీసు రోడ్ల సౌ కర్యం కల్పించకపోవడం దారుణమన్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక పంటలు తెచ్చుకునే అవకాశం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రేచర్ల నుంచి లింగగూడెం వరకు అన్ని గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కొద్దిసేపు తరువాత ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సంఘటనా స్థలానికి వచ్చి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని రైతులకు హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణ కంపెనీ జనరల్ మేనేజర్, శెట్టివారిగూడెం, వెంకటాపురం, రేచర్ల, ఎర్రగుంటపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్ జెర్మియా

ప్రేమ, ఐక్యతే శాంతికి సంకేతం

● దైవ సేవకుల సదస్సులో వక్తలు

పెదవేగి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ ప్రేమ, ఐక్యతతో జీవనం సాగించాలని,అప్పుడే సమాజంలో శాంతి, సుస్థిరత ఏర్పడుతుందని పెదవేగి మండలం పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు చొప్పెల్లి జెర్మియా అన్నారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెం సీఎస్ఐ చర్చి ఆవరణలో మంగళవారం జరిగిన దైవ సేవకుల సదస్సులో పాస్టర్ జెర్మియా మాట్లాడుతూ దేవుని సేవలో జీవించే వ్యక్తి ఎప్పు డూ సుఖ సంతోషాలతో, ఆనందమయ జీవనం సాగిస్తా డన్నారు. దైవసేవకులు తమ ప్రాంతం, దేశం అభివృద్ధి చెందడానికి తమవంతు కృషి చేయాలని ఆయన పిలు పునిచ్చారు. ఈ సదస్సులో పాస్టర్లు మిలాంగ్టన్, జోసెఫ్, సుధాకర్, జయసుందర్, సంఘసభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు గడువు పెంపు

ఏలూరుఅర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు ఈ నెల 3వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు తెలిపారు. ఇంటర్, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బుధవారంలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి విద్యార్థుల సౌలభ్యం కోసం తమ కళాశాలలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు.

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద దాత పర్వతనేని విష్ణు వర్షప్రసాద్, రాధిక దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించినట్లు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తెలిపారు. సుమారు 300 మంది భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థికి ట్రైసైకిల్ అందజేత

పెదపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి రామాల హృతిక్ చరణ్‌కు భవిత(సమగ్ర శిక్షణ) తరఫున ట్రైసైకిల్ అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎస్.ఎం.సి. ఛైర్మన్ వి.సుబ్రహ్మణ్యంతో కలిసి ట్రైసైకిల్‌ను విద్యార్థి హృతిక్‌కు అందజేశారు. విజయ, మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విష జ్వరాలపై అవగాహన

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మలేరియా ఏలూరు సబ్‌యూనిట్ అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. మంగళవారం స్థానిక పవర్‌పేట అర్బన్ పీహెచ్‌సీలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విషజ్వరాలు సంక్రమించే అవకాశం ఉందన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, రోడ్లపక్కన విక్రయించే ఆహారపదార్థాలు, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, వేడివేడి ఆహారపదార్థాలనే భుజించాలన్నారు. వైద్యాధికారి గౌతమ్, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, మణికుమార్ పాల్గొన్నారు.

కుమ్మరగట్టులో వైద్య శిబిరం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డయేరియా ప్రబలిన కుమ్మరగట్టు గ్రామంలో వైద్యాధికారులు రెండవ రోజు కూడా వైద్య శిబిరాన్ని కొనసాగించారు. మంగళవారం ఇద్దరు అనారోగ్యానికి గురికాగా నందాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యసేవలందించారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. వైద్యాధికారి సల్మా గ్రామంలో పర్యటించి ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు.

వసతులు కల్పించండి

లింగపాలెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సింగగూడెంలోని మోడల్ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని, పాఠశాలకు కనీస వసతులు కల్పించేందుకు నిధులను కేటాయించాలని పీ ఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పువ్వల ఆంజనేయులు, సర్పంచ్ బొంతు రాంబాబులు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను కలిసి విన్నవించారు. సింగగూడెంలోని మోడల్ పాఠశాలలో ప్రస్తుతం 70 మంది విద్యార్థులున్నారని అందుకు అనుగుణంగా అదనపు తరగతి గదులు నిర్మించేందుకు, తాగునీటి అవసరాలకు, ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. తమ వినతి పట్ల ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారంటూ హెచ్ఎం ఆంజనేయులు తెలిపారు.

పింఛన్లు మంజూరు చేయండి

బుట్టాయగూడెం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ, బీసీలకు, వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పేదలు రెడ్డి గణపవరం సచివాలయం ఎదుట ఆందోళన చేశారు. 50 ఏళ్లు నిండిన ఎస్సీలు, బీసీలకు పింఛన్లు ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కేవీపీఎస్ నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. కె.రాములు, దుర్గారావు, గంగరాజు, నాగేశ్వరరావు, విజయ, లక్ష్మీ, రమణమ్మ పాల్గొన్నారు.

యువతి కనిపించడం లేదని ఫిర్యాదు

పెదపాడు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్దకు డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తన కుమార్తె వెళ్లి తిరిగి రాలేదని, చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ కన్పించడం లేదని పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన సీహెచ్ వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదపాడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

కాజ్‌వే పై బ్రిడ్జ్ నిర్మిస్తాం

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): శనివారపుపేట కాజ్వేపై బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తమ్మిలేరులో నీటి ప్రవాహం పెరిగి తమ్మిలేరు కాజ్వే పైకి నీరు ప్రవహించటంతో ఎమ్మెల్యే చంటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతు వరదలు వచ్చినప్పుడ ల్లా కాజ్వే మునిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ్మిలేరు ద్వారా 7వేల క్యూసెక్కుల వరదనీరు కొల్లేరులో కలుస్తుందన్నారు. దీంతో కాజ్వే మునిగిపోతుందన్నారు.

నేడు 'సారథ్యాని'కి తరలిరండి

ముదినేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సారథ్యం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏలూరులో జరుగనున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటన, శోభాయాత్రకు కైకలూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోట ప్రోలు కృష్ణారావు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముగ్గురికి స్పౌజ్ పెన్షన్ల పంపిణీ

ముసునూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లిలో నూతనంగా ముగ్గురు వితంతువులకు మంజూరైన స్పౌజ్ పెన్షన్లను సర్పంచ్ టి. రాధిక సత్యనారాయణ, ఎంపీటీసీ కాటేపల్లి పుష్పావతి శ్రీనివాసరావులు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ భర్త చనిపోయిన నెలరోజుల్లో భార్యకు వితంతు పెన్షన్ అందించి, వారికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సొసైటీ అధ్యక్షుడు కాటేపల్లి ప్రసాద్, టీడీపీ గ్రామ అధ్యక్షులు కె.సత్యనారాయణ, తెలుగుయువత మండల అధ్యక్షుడు కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు.. 33 టన్నుల ఎరువులు సీజ్



చనుబండలో ఎరువుల షాపు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

చాట్రాయి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ అధికారులు మండలం లోని చనుబండలో రెండు ఎరువుల షాపులలో మంగళ వారం ఏకకాలంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర మెన్యూర్స్ అండ్ జనరల్ స్టోర్స్, శ్రీ డెక్కన్ ఆగ్రో కెమికల్స్‌లో లెక్కల్లో చూపని రూ. 7.91 లక్షల విలువైన 33.100 టన్నుల ఎరువులు సీజ్ చేసి, షాపుల యజమానులపై నిత్యావసరాల చట్టం 1955 ప్రకారం 6(ఏ) కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రంజిత్‌కుమార్, విజిలెన్స్ ఏవో ఎం. మీరయ్య, చాట్రాయి ఏవో శివశంకర్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆది కర్మయోగి పథకానికి పోతనపల్లి ఎంపిక



మాట్లాడుతున్న పీవో శ్రీరాములు నాయక్

చాట్రాయి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆది కర్మయోగి అభియాన్‌తో గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీరాములు నాయక్ అన్నారు. ఈ పథకం కింద మండలంలో గిరిజన గ్రామం పోతనపల్లి ఎంపికైందన్నారు. చాట్రాయి వెలుగు కార్యాలయంలో మంగళవారం పోతనపల్లి పంచాయతీ పరిధిలోని అన్ని శాఖల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈ పథకం కింద ఏలూరు జిల్లాలో చాట్రాయి, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, టి. నర్సాపురం, నూజివీడు, చింతలపూడి మండలాల్లో 46 గ్రామాలు ఎంపికయ్యాయన్నారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి అంతరాలను తగ్గించటానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఐటీడీఏ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ రవి ప్రసన్నకుమార్, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, డీటీ ఈశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ధాత్రి గ్రామ ఉత్కర్ష్ అమలు చేయండి

మండలంలోని ఏకైన గిరిజన తండా అయిన పోతనపల్లిలో ధాత్రి గ్రామ ఉత్కర్ష్ పథకాన్ని అమలు చేసి అభివృద్ధి చెయ్యాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శ్రీరాములు నాయక్‌కు చాట్రాయిలో మంగళవారం జిల్లా గిరిజన సంక్షేమ సేవా సంఘం నాయకుడు డి. మంగయ్య విన్నవించారు. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో తమ గిరిజన గ్రామంలో మౌలిక వసతుల కల్పన, కమ్యూనిటీ భవనాలు, పాఠశాలలు అభివృద్ధి చెయ్యాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు మంగయ్య తెలిపారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన వీటీహెచ్ క్రీడాకారులు

నూజివీడు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-18 బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలకు నూజివీడు విక్టోరియా టౌన్ హాల్ క్రీడాకారులు ఎన్నికైనట్లు వీటీహెచ్ కోచ్ వాక నాగరాజు తెలిపారు. పిఠాపురంలో గత నెల 14 నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలలో వీటీహెచ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును మూడో స్థానంలో నిలిపారన్నారు. ఈ నేపథ్యంలో పంజాబ్‌లోని లూధియానాలో నిర్వహించే జాతీయ స్థాయి అండర్-18 బాస్కెట్‌బాల్ పోటీలకు బాలుర జట్టుకు వాక రాహుల్, బాలికల జట్టుకు బేతాళ ప్రభుదీపిక, బుర్రె ప్రణవి ఎంపికయ్యారన్నారు.

లోపూడిలో వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

ముసునూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపూడిలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంలో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో పునఃప్రారంభమైంది. ప్లాంట్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు మంగళవారం ప్రారంభించి మాట్లాడుతూ ఐదేళ్ళ క్రితం ఈ ప్లాంట్ మరమ్మతుకు గురై, శిథిలావస్థకు చేరినా నాటి పాలకులు, అధికారులు పట్టించుకోలేదన్నారు. ప్రజల తాగునీటి ఇబ్బందులను స్థానిక టీడీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకువెళ్ళగా, ఆయన వెంటనే స్పందించి, వాటర్ ప్లాంట్ వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన రూ. 3 లక్షల నిధులను మండల పరిషత్ నుంచి మంజూరు చేయించారని చెప్పారు. మంత్రికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు చలమాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎలికే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి వైఎస్ఆర్ కృషి



ఆగిరిపల్లిలో వైఎస్‌కు నాయకుల నివాళి

ముసునూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వర్గాల అభ్యున్నతికి మాజీ సీఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి కృషి చేశారని ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్ అన్నారు. మంగళవారం వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని ముసునూరులో ఆయన చిత్రపటానికి మండల కన్వీనర్ మూల్పూరి నాగవల్లేశ్వరరావు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే వలసపల్లిలో సొసైటీ మాజీ అధ్యక్షుడు దేవినేని సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

ఆగిరిపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆగిరిపల్లి బస్టాండు సెంటర్‌లో వైసీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు వైఎస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, పల్లగాని నరసింహారావు, షేక్ నాగుల్ మీరా, సాదం గోపీనాద్, నియోజకవర్గ మహిళ నాయకురాలు తులిమెల్లి పావన జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగర్‌జలాలు

ఆగిరిపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో ఉన్న చివరి ఆయకట్టు వరకు సాగర్ జలాలను తీసుకురావడమే లక్ష్యంగా మంత్రి పార్థసారథి పనిచేస్తున్నారని శోభనాపురం పీఏసీఎస్ చైర్మన్ నలజాల హరిబాబు అన్నారు. ఎన్ఎస్‌పీ డీఈఈ సీతారామమ్మ పర్యవేక్షణలో మాచవరం మేజర్ సాగర్ కాలువ కట్టకు మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట తూములు ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వేణు, డీసీ వైస్ చైర్మన్ ఉప్పు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 126, 137
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

▸▸పలుచోట్ల రక్తదాన శిబిరాలు ▸▸అభిమానులు, పార్టీ శ్రేణుల సేవా కార్యక్రమాలు



కైకలూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని



ముదినేపల్లి మండలం కొత్తపల్లిలో వేడుకలు



చెక్కపల్లి శిబిరంలో యువకుడి రక్తదానం



నూజివీడులో పవన్ జన్మదిన వేడుకలు

కైకలూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని అభిమానులు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు తాలుకా సెంటర్లో సర్పంచ్ కేవీఎన్ఎం నాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ట్రావెలర్స్ బంగ్లాలో జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్ సహకారంతో ఏఎస్ఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా 49 మంది రక్తదానం చేశారు. భారీ కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కైకలూరు వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ ఆధ్వర్యంలో కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి రోగులకు అన్నదానం ఎమ్మెల్యే చేతులమీదుగా నిర్వహించారు. మండలంలోని భుజబలపట్నంలో విజయా హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, బీకేఎం నాని, పూల రామచంద్రరావు, పైడిపాటి శివశంకర్, ఎండీ జానీ, పొత్తూరి వాసురాజు, చెరుకువాడ బలరామరాజు, జనసేన వీరమహిళలు తోట లక్ష్మీ, శొంఠి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని కూటమి కార్యాలయం వద్ద, గురజ రోడ్ సెంటర్‌లో జరిగిన పవన్ కల్యాణ్ పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు కోడూరు శేషుబాబు, చల్లగుళ్ళ ఆదిత్య చౌదరి, బొంగు రవి కుమార్, దావు నాగరాజు, ఈడే సుధాకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి వేల్పూరి నానాజీ తదితరులు పాల్గొన్నారు. కొర్రగుంటపాలెంలో జనసేన నాయకుడు ఏఎస్ బాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లోను ఎమ్మెల్యే పాల్గొన్నారు. కొత్తపల్లి, బొమ్మినంపాడు గ్రామాల్లోను వేడుకలు జరిగాయి. జనసేన నాయకులు మోటేపల్లి హనుమ, నల్లగోపుల చలపతి, మట్లపూడి మదన్‌మోహన్, బాసినశెట్టి కిషోర్, యర్రా నాని, జనసేన కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

ముసునూరు: జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం చెక్కపల్లిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరాన్ని మాజీ జడ్పీటీసీ చిలుకూరి వెంకటేశ్వరరావు, యువనేత కూచిపూడి దేవేంద్ర ప్రారంభించారు. జనసైనికులు, పవన్‌కల్యాణ్ అభిమానులు సుమారు 40 మందికి పైగా రక్తదానం చేశారు. నిర్వాహకుడు, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ జె.సత్యనారాయణ రాజు, మండల కో-ఆర్డినేటర్ తోట ప్రభాకర్‌రావు పండ్లు, స్నాక్స్, జ్యూస్ అందజేశారు. జనసేన మండల కార్యదర్శి పల్లి రాజు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను కూటమి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేకులు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. చీపురుగూడెంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చాట్రాయి మెయిన్ ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు, ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి: ఎస్సార్పీ అగ్రహారంలో జనసేన సెంట్రల్ ఆంధ్ర జోన్ కన్వీనర్ నల్లగోపుల చలపతిరావు ఆధ్వర్యంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కామినేని ముఖ్య అతిథిగా పాల్గొని కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం హోప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రక్తదాన శిబిరం ప్రారంభించారు. మాజీ ఎంపీపీ చెన్నంశెట్టి మురళీకృష్ణ, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీంద్ర, జనసేన నాయకుడు కొల్లి బాబి, చెన్నంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: స్థానిక బస్టాండు సెంటర్లో జనసేన నాయకుడు బజారు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీజేపీ నాయకుడు రాజశేఖర్, జనసేన నాయకులు పాశం నాగబాబు, గిరిహరీష్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

'ఉపాధి'లో బోగస్ మస్తర్లు

▸▸మూడేళ్లుగా అవకతవకలు ▸▸అధికారులకు వి.రావిగుంట గ్రామస్థుల ఫిర్యాదు



ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మెమొరాండం అందజేస్తున్న పలువురు గ్రామస్థులు

ముదినేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వి.రావిగుంట పంచాయతీ ఏరియాలో మూడేళ్లుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల నిర్వహణలో జరిగిన అవకతవకలు, అవినీతిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం ముదినేపల్లి ఎంపీడీవో కార్యాలయ అధికారులకు, ఉపాధి పథకం అధికారులకు మెమొరాండం అందజేశారు. 2022-23, 23-24, 24-25 సంవత్సరాల్లో గ్రామంలో జరిగిన ఉపాధి పనుల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఉపాధి పనుల్లో గ్రామంలోని కూలీలతోపాటు 20 ఏళ్లుగా గ్రామంలో లేని వారి పేరున, గ్రామంలో నివశిస్తూ పనులకు వెళ్లని వారి పేరున కూడా మస్తర్లు వేసి ఫీల్డ్ అసిస్టెంట్ వేతనాలు ఇప్పిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. సుమారు 18 మంది హైదరాబాద్, విజయవాడ పట్టణాల్లో ముదినేపల్లి, కలిదిండి, బంటుమిల్లి, సీతనపల్లి గ్రామాల్లో వివిధ వృత్తుల్లో ఐదు నుంచి 20 సంవత్సరాలుగా స్థిరపడిన వారి పేరున, గ్రామంలో ఉండి పనులకు వెళ్లని ఐదుగురి పేరున ఫీల్డ్ అసిస్టెంట్ మస్తర్లు వేస్తున్నారని, ఈ అవకతవకలపై విచారణ నిర్వహించాలని, ఉపాధి నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ అర్జా రామజోగేశ్వరరావుతోపాటు ఎం.ఇస్సాకు, బొడ్డు వీరాంజనేయులు, సీహెచ్.చిరంజీవి, కాంతారావు, వి.అనిల్ కుమార్, ఎం.డేవిడ్, డి.లక్ష్మణరావు తదితరులు అధికారులను కోరారు.

హరికృష్ణకు కామినేని నివాళి

కైకలూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు నందమూరి హరికృష్ణ జయంతి సందర్భంగా కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ నాయకుడు బీకేఎం నాని, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాధరాజు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, ఎస్సీ సెల్ నాయకుడు వీరాబత్తిన సుధా, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, అధ్యక్షుడు పడమటి వాసు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి మండల టీడీపీ అధ్యక్ష పదవికి ఐవీఆర్ఎస్ సర్వే

ముదినేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముదినేపల్లి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు అభ్యర్థుల ఎంపికపై మంగళవారం పార్టీ అధిష్ఠానం మంగళగిరి కేంద్ర కార్యాలయం నుంచి ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా అభిప్రాయ సేకరణ నిర్వహించింది. అధ్యక్ష పదవికి బొప్పన సుందరరామయ్య, గుడివాడ వేణు, పోసిన పాండురంగారావు పోటీపడగా ఇటీవల పార్టీ పరిశీలకులు గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ లెవెల్ కన్వీనర్ల అభిప్రాయలను సేకరించి అధిష్ఠానానికి నివేదిక పంపారు. ఈ నివేదికను పరిశీలించిన పార్టీ రాష్ట్ర నాయకత్వం మంగళవారం ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించి సభ్యత్వం కలిగిన కార్యకర్తల అభిప్రాయాలను సేకరించింది. సర్వే ఫలితం ఎలా ఉంటుందన్నది ఆసక్తిగా మారింది.

స్మార్ట్ కార్డులతో లబ్ధిదారులకెంతో మేలు : కామినేని



కలిదిండిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ కార్డులతో రేషన్ పంపిణీలో లబ్ధిదారులకు ఏవిధమైన ఇబ్బందులు కలగవని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరులో క్యూఆర్ కోడ్ ఆధారిత కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసి మాట్లాడుతూ రేషన్ సరుకులు పంపిణీలో లబ్ధిదారులు వేలి ముద్రలు మిషన్లు తీసుకోకపోవడంతో అనేకసార్లు తిరగవలసి వస్తోందని ఇప్పుడు క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసుకుంటే అన్ని వివరాలు చూడవచ్చన్నారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బాబు విలియమ్స్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో మంగళవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ కార్డులను ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయటానికి 46 టీములు ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, డీసీ చైర్మన్లు భోగేశ్వరరావు, సత్యనారాయణ, ఆర్ఐ శ్యామల, వీఆర్వోలు పాల్గొన్నారు.

మండవల్లి: ప్రతి పేదవాడికి రేషన్‌కార్డును త్వరితగతిన అందించి ప్రభుత్వ పథకాలకు అర్హులుగా మార్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే కామినేని పేర్కొన్నారు. మండవల్లిలో ఆయన స్మార్ట్ రేషన్ కార్డులు అందించి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో మండలానికి ఒక కిలోమీటరు రోడ్డు వేయలేకపోయిందని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, జడ్పీటీసీ ముంగర విజయనిర్మల, ఎన్డీయే నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, సర్పంచ్ ఝాన్సీ, తహసీల్దార్ గోపాల్, డీటీ కుమారి పాల్గొన్నారు.

ముదినేపల్లి: ప్రభుత్వం నూతనంగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ముదినేపల్లి మండలంలో మంగళవారం ప్రారంభమైంది. మండలానికి కేటాయించిన 18,700 స్మార్ట్ కార్డులను వినియోగదార్లకు అందజేయనున్నట్లు తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు. మండలంలోని వడాలిలో ఈ స్మార్ట్ కార్డుల పంపిణీని కైకలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయకమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల వ్యవస్థను మరింత పటిష్టంగా నిర్వహించి వినియోగదార్లకు మెరుగైన సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు నక్కా అప్పారావు, కార్యదర్శి బొర్రా లక్ష్మీనారాయణ, నాయకులు జోగి సుబ్రహ్మణ్యం, చిలకలపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి వైస్ ఎంపీపీ జగన్మోహనరావు హఠాన్మరణం



చాట్రాయి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల వైస్ ఎంపీపీ చల్లగుళ్ళ జగన్మోహనరావు(57) కొత్తగూడెంలో స్వగృహంలో సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఈయన సర్పంచ్‌గా కూడా పని చేసి గ్రామాన్ని అభివృద్ధి చేశారు. నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వివిధ పార్టీల నాయకులు జగన్మోహనరావు భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి ఆయన కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జగన్మోహనరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



కైకలూరు కోర్టులో విధులను బహిష్కరించిన న్యాయవాదులు

కైకలూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విచారణ చేయకుండానే న్యాయవాదులపై కేసులు నమోదు చేయడం దారుణమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురజాడ ఉదయశంకర్ అన్నారు. న్యాయవాదులపై అక్రమ కేసులు నమోదుకు నిరసనగా మంగళవారం కైకలూరు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కోర్టు ఎదురుగా నిరసన చేపట్టారు. ఇటీవల కాలంలో విచారణ లేకుండానే బాపట్ల, నందిగామలో పోలీసులు కేసులు నమోదు చేశారని ఏ కేసులో అయినా విచారణ చేసి కేసు నమోదు చేయాలని కానీ ఎలాంటి విచారణ చేయకుండానే కేసు నమోదు చేశారన్నారు. దీనిపై బుధవారం కూడా విధులు బహిష్కరిస్తున్నామన్నారు. న్యాయవాదులు వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, బోడావుల ఇందిర, కె. రమాదేవి, బి. లక్ష్మణరావు, ఎంఎస్ఎస్ రాజు, పి. పవన్‌కాంత్, జితేంద్ర, శంకర శాస్త్రి, గంగాధర్, అడగర్ల రాంబాబు, రజీమున్నీ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి లడ్డూల బహూకరణ

కలిదిండి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలిదిండి సెంటర్‌లో ఏర్పాటు చేసిన 12 అడుగుల గణపతికి వ్యాపారి బత్తుల హనుమంతరావు 50 కిలోల తాపేశ్వరం లడ్డూ, వసంత టీ స్టాల్ 25 కిలోల లడ్డూ, పూర ప్రసాద్ 25 కిలోల లడ్డూలను మంగళవారం సమర్పించారు. తొలుత లడ్డూలను వ్యాన్‌పై ఊరేగింపుగా వినాయకుడి మండపానికి తీసుకెళ్లారు. మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, బోయిన గోవింద్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూర శ్రీధర్, నీలి సుమన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో గణేశ్ నవరాత్రులు

ముదినేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు మండలంలో వైభవంగా జరుగుతున్నాయి. శ్రీహరిపురంలో విశేషంగా అలంకరించిన మంటపంలో మంగళవారం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, విగ్రహ దాతలు నీలం సుబ్బారావు దంపతులతోపాటు పలువురు భక్తులు శివ పార్వతులు, గంగను శిరస్సున దాల్చిన వినాయకుడి విగ్రహానికి పూజలు జరిపారు. పెదగొన్నూరులోని వినాయక స్వామి దేవస్థానంలో శాలివాహనుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతున్నాయి.

పండుగలకు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వివిధ పండుగలను పురస్కరించుకుని ప్రయాణి కుల రద్దీ నేపథ్యంలో ప్రత్యేక రైళ్లను నడుపుతు న్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించారు.మరికొన్నింటిని పొడిగిస్తున్నట్టు వెల్లడించారు. రైల్ నెంబర్ 07027 చర్లపల్లి - బ్రహ్మపూర్ (ప్రతి శుక్రవారం) ఈ నెల 5వ తేదీ నుంచి నవంబరు 28 వరకు నడపనున్నారు. 07028 బ్రహ్మపూర్ - చర్లపల్లి (ప్రతి శనివారం) 6 నుంచి నవంబరు 29 వరకు, 07225 చర్లపల్లి - షాలిమర్ (కోల్ కత్తా) ప్రతి సోమవారం 1 నుంచి అక్టోబర్ 13 వరకు, 07226 షాలిమర్ - చర్లపల్లి (ప్రతి మంగళవారం) 2 నుంచి అక్టోబరు 14 వరకు, 08439 పూరి - పాట్నా(ప్రతి శనివారం) ఈ నెల 13నుంచి నవంబర్ 29 వరకు నడపనున్నా రు. 08440 పాట్నా - పూరీ(ప్రతి ఆదివారం(14 నుంచి నవంబరు 29 వరకు, 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్(ప్రతి శనివారం) ఈ నెల 13 నుంచి నవంబర్ 29 వరకు, 02812 యశ్వంత్ పూర్-భువనేశ్వర్(ప్రతి సోమవారం) సెప్టెంబర్ 15 నుంచి డిసెంబరు 1 వరకూ నడపనున్నారు. 08581 విశాఖపట్టణం - ఎస్ఎంవిటి బెంగళూరు (ప్రతి ఆదివారం) ఈ నెల 14 నుంచి నవంబరు 31 వరకు, 08582 ఎస్ఎంవీటీ బెంగళూరు - విశాఖపట్నం(ప్రతి సోమవారం) ఈ నెల 15 నుంచి డిసెంబర్ 1వరకు, 08547 విశాఖపట్టణం - తిరుపతి (ప్రతి బుధవారం)అక్టోబరు 1 నుంచి నవంబరు 26 వరకు, 08548 తిరుపతి - విశా ఖపట్టణం (ప్రతిగురువారం) అక్టోబరు 2 నుంచి నవంబరు 27 వరకు, 08579 విశాఖపట్టణం - చర్లపల్లి (ప్రతి శుక్రవారం) అక్టోబర్ 3 నుంచి నవంబరు 28 వరకు, 08580 చర్లపల్లి - విశాఖ పట్టణం (ప్రతిశనివారం)అక్టోబరు 4నుంచి నవం బరు 29వరకు నడపనున్నారు.07219 నర్సాపూర్ - తిరువన్నమల్లయ్ (ప్రతి బుధవారం) అక్టోబర్ 1,8,22, నవంబర్ 5,19,26 తేదీల్లో, 07220 తిరువన్నమల్లయ్ - నర్సాపూర్ (ప్రతిగురువారం) అక్టోబర్ 2, 9, 23 నవంబర్ 6, 20, 27 తేదీల్లో, 06055 పోడనూరు - భరోనీ (ప్రతి శనివారం) సెప్టెంబర్ 6 నుంచి 29 వరకు, 06056 భరోనీ - పోడనూరు(ప్రతి మంగళవారం)ఈ నెల 9 నుంచి డిశంబరు 2 వరకు నడపనున్నారు. 06063 కోయంబత్తూర్ - ధన్‌బాగ్ (ప్రతి శుక్రవారం) ఈ నెల 5 నుంచి నవంబరు 28 వరకు, 06064 ధన్‌బాగ్ - కోయంబత్తూర్ (ప్రతి సోమవారం) ఈ నెల 8 నుంచి డిసెంబరు 1 వరకు, 06077 చెన్నై సెంట్రల్ - సత్రగంజి (ప్రతి శనివారం) ఈ నెల 6 నుంచి సెప్టెంబర్ 27 వరకు, 06078 సత్రగంజి - చెన్నై సెంట్రల్ (ప్రతి సోమవారం) ఈ నెల 8 నుంచి సెప్టెంబరు 29 వరకు నడప నున్నట్టు అధికారులు తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

ముదినేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెనుమల్లి శివారు సింగారం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఫ్లెక్సీ వివాదానికి దారి తీసింది. చవితి ఉత్సవాల సందర్భంగా సర్పంచ్‌తో పాటు వాసుపల్లి మాధవి నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని గ్రామంలో ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలో మాధవి భర్త నాగరాజు ఫొటో కూడా ఉంది. దీనిపై అదే గ్రామానికి చెందిన గోట్రు రామకృష్ణ ఫ్లెక్సీలో నాగరాజు ఫొటో ఉండటంపై వారి ఇంటికి వెళ్లి అసభ్యంగా మాట్లాడాడు. సోమవారం రాత్రి అన్నసమారాధన సందర్భంగా నాగరాజుతో వివాదానికి దిగి రామకృష్ణ, గోట్రు వీరబాబు గొడవ పడ్డారు. అనంతరం నిందితులు రాడ్లతో వచ్చి నాగరాజు, అతని భార్యపై దాడి చేశారు. మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల షెడ్డులోకి దూసుకెళ్లిన కారు

ముదినేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి గ్రామం వద్ద ప్రధాన రహదారి పక్కనే ఉన్న పశువుల షెడ్డులోకి కారు దూసుకుపోయిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఏడాది జూలై 28వ తేదీ అర్ధరాత్రి కారు ఆ షెడ్డులోకి దూసుకుపోయి తిరగబడగా, షెడ్డు కూలిపోయింది. షెడ్డులోని ఒక పాడి గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి గ్రామ పెద్దలు సమస్యను పరిష్కరించకపోవడంతో షెడ్డు యజమాని శొంఠి జగన్మోహనరావు మంగళవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో కారు డ్రైవర్ మహేష్‌పై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లు వర్షార్పణం

(5వ పేజీ తరువాయి)

దానిపై ప్రాథమిక అంచనాలను కలెక్టర్‌కు ఆర్‌అండ్‌బీ అధికారులు నివేదించారు. కైకలూరులో 15 కిలోమీటర్లు పూర్తిగా కోతకు గురైందని, ముంపు మండలాలు కుక్కునూరు, వేలేరుపాడుతోపాటు సమీప మండలాల్లో ఆరు కిలోమీటర్లు మేర రోడ్లు దెబ్బతిన్నట్టు లెక్కలు తేల్చారు. ఇంకా గోతుల్లో వరద నీరు ఉండడం వల్ల వారం రోజుల తర్వాతే తుది అంచనాలు సిద్ధం చేసే అవకాశాలున్నాయి. కలెక్టర్‌కు ప్రాథమిక నివేదిక ఇచ్చామని, వర్షాలు తగ్గుముఖం పట్టాక అంచనాలు వేసి పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేసే అవకాశాలు వున్నాయని జిల్లా రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ విజయరత్నం తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

కలిదిండి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుర్వాయిపాలెంలో మంగళవారం పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకుని రూ.5,500 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే 94407 96435 సమాచారం ఇవ్వాలని కోరారు.